News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
Website cknewstv.in

సంపుటి : 04 | సంచిక :327 | ఖమ్మం | బుధవారం జనవరి 7, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## కాశీ ఎక్స్‌ప్రెస్ కు బాంబు బెదిరింపు



- గోరఖ్‌పూర్ నుంచి ముంబైకి ప్రయాణిస్తున్న రైలుకు బాంబు బెదిరింపు
- 'మౌ' స్టేషన్‌లో రైలును నిలిపి తనిఖీలు నిర్వహించిన అధికారులు
- ఎలాంటి అనుమానిత వస్తువులు లభ్యం కాలేదని వెల్లడి

వివరాలు 2లో..

## వెనెజువెలా సంక్షోభం... భారత్‌కు మేలు చేస్తుందంటున్న నిపుణులు!

- వెనెజువెలా సంక్షోభంతో భారత్ ఆయిల్ బిల్లుపై తక్షణ ప్రభావం ఉండదన్న నిపుణులు
- ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సరఫరాలు మిగులు స్థాయిలో ఉన్నాయని వెల్లడి
- ఇతర దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి భారత్‌కు తక్కువ ధరకే చమురు
- అమెరికా జోక్యంతో భవిష్యత్తులో ధరలు తగ్గే అవకాశం ఉందని అంచనా

వివరాలు 2లో..






### పర్యావరణం బాగు కోసమే

# హిల్ట్ పాలసీ!

- అవి సర్కారు భూములు కాదు.. పరిశ్రమలకు అమ్మినవి
- స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వకుంటే మనది అసమర్థ నాగరికతే

- అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదు.
- భావితరాలకు క్లీన్ ఎన్విరాన్మెంటే నిజమైన వారసత్వం
- ఓఆర్ఆర్ లోపల పరిశ్రమలతో ఆరోగ్యానికి ముప్పు
- అసెంబ్లీలో హిల్ట్ పాలసీ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని భూగర్భ జలాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నాయని.. పారిశ్రామిక రసాయల వల్లే భూగర్భ జలాల్లో విషపూరిత పదార్థాలు చేరాయని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇప్పటికీ మేల్కొకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు. ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతి ఇంటికి ఒక ఆసుపత్రి ఉంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు.**

మంగళవారం (జనవరి 6) అసెంబ్లీలో హిల్ట్ పాలసీపై షార్ట్ డిస్కషన్ నడిచింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం నివాస ప్రాంతంగా మారుతోందని.. సిటీలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపునకు తరలిస్తామన్నారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం యత్నిస్తున్నారని చెప్పారు. జీడీమెట్ల, ఉప్పల్, సనత్ నగర్, చర్లపల్లి ప్రాంతాలు గతంలో ఇండస్ట్రీయల్ జోన్లుగా జనవాసాలకు దూరంగా ఉండేవి కానీ 50 ఏళ్లలో హైదరాబాద్ మహానగరంగా విస్తరించిందని అన్నారు. ఒకప్పుడు నగర శివారు ప్రాంతాలు ప్రస్తుతం రెసిడెన్షియల్ కాలనీస్‌గా మారాయని.. ప్రస్తుతం పరిశ్రమలకు పక్కనే అపార్ట్ మెంట్లు ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాన్నిప్రత్యక్షంగా పీలుస్తున్నారని.. ఇండస్ట్రీలు, రెసిడెన్షియల్ ప్రాంతాలకు మధ్య బఫర్ జోన్లు లేవన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం వల్లే ఎల్జీ పాలిమర్స్, భోపాల్ గ్యాస్ దుర్ఘటన వంటివి జరిగాయని గుర్తు చేశారు. హిల్ట్ పాలసీ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయాలు పక్కన పెట్టాలని కోరారు. చైనాలో బ్లూస్కై పాలసీ ద్వారా భారీ పరిశ్రమలను నగరం అవతలివైపునకు తరలించారని గుర్తు చేశారు. పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఢిల్లీలో జనవాసాల మధ్య ఉన్న 168 పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## కుటుంబం అన్నాక సమస్యలు ఉంటాయి

- ఎన్నికల్లో ఎవరికి అవకాశం వచ్చినా అందరూ కలిసి పనిచేయాలన్న కేటీఆర్
- టిక్కెట్ వచ్చే వరకే అసంతృప్తులు ఉండాలన్న కేటీఆర్
- బీఫామ్ ఇచ్చాక అందరు కలిసి ముందుకు సాగాలని సూచన



కుటుంబం అంటే సమస్యలు సహజమని, చిన్న చిన్న మనస్పర్థలు, అభిప్రాయ భేదాలు సర్వసాధారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలా లేకపోతే అది కుటుంబమే కాదన్నారు. ఒక ఇంట్లో నలుగురు ఉంటేనే సాయంత్రం వంట విషయంలో ఒకరు వంకాయ, మరొకరు బెండకాయ అని వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తారని, కుటుంబంలో చిన్నపాటి పంచాయితీలు కూడా ఉంటాయని, అయితే వాటిని ఇంటికే పరిమితం చేసి ఆ తర్వాత కలిసిపోవాలని ఆయన సూచించారు. జనగామ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ పోటీకి ఒకరికే అవకాశం ఉంటుందని అన్నారు. టిక్కెట్ వచ్చే వరకు మాత్రమే పార్టీలో అసంతృప్తులు ఉండాలని, ఒకరికి బీఫామ్ ఇచ్చిన తర్వాత అందరూ కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. మనం ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నామని, బీఫామ్ ఇచ్చిన తర్వాత కూడా పార్టీలో అసంతప్తులు ఉంటే కాంగ్రెస్, బీజేపీలకు విమర్శించే అవకాశం ఇచ్చినట్లవుతుందని ఆయన అన్నారు.బీఫామ్ ఒక్కరికే వస్తుందని, పార్టీ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని టిక్కెట్ ఇస్తుందని కేటీఆర్ అన్నారు. టిక్కెట్ ఎవరికి ఇచ్చినా కళ్లు మూసుకుని కారు గుర్తుపై ఎవరున్నా వారినే కేసీఆర్‌లా భావించి ఓటు వేయాలని ఆయన కోరారు. కాగా, కవిత బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తూ, కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## కవితకు మద్దతుగా ఆమె ఇంటి వద్దకు భారీగా తరలివచ్చిన అభిమానులు

బాల్కనీలో నిలబడి అందరికీ అభివాదం చేసిన కవిత

కిందకు వచ్చి అందరినీ పలకరించిన వైనం

మీరే నా బలం అంటూ కవిత భావోద్వేగం



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటి వద్దకు భారీ సంఖ్యలో ఆమె అభిమానులు చేరుకున్నారు. 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చబోతున్నామని ఆమె ప్రకటించిన వెంటనే, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నేతలు, ఉద్యమ కార్యకర్తలు భారీగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్దకు తరలివచ్చారు.ఈ సందర్భంగా కవిత తన ఇంటి బాల్కనీలో నిలబడి అందరికీ చేతులు జోడించి అభివాదం చేశారు. తర్వాత కిందకు వచ్చి ప్రతి ఒక్కరినీ పలకరించారు. "ఎలా ఉన్నారు? ఇంట్లో అందరూ బాగున్నారా?" అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.


ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తన వెన్నంటి ఉండి, ఇప్పుడు కష్టకాలంలో కూడా మద్దతుగా నిలిచిన ఉద్యమకారులను చూసి కవిత భావోద్వేగానికి లోనయ్యారు. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె గొంతు కంపిస్తూ "మీరు లేకపోతే నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. మీరు నా బలం" అంటూ మాట్లాడారు.ఈ సందర్భంలో అక్కడి పరిసర ప్రాంతాలు నినాదాలతో మారుమోగాయి. "జై తెలంగాణ...

వివరాలు 2లో..

# డిజిటల్ జోరులో తెలంగాణ..

## ల్యాప్‌టాప్‌ల వినియోగంలో దేశంలోనే టాప్!

- పట్టణ గృహాల్లో ల్యాప్‌టాప్‌ల వినియోగంలో దేశంలోనే మొదటి స్థానం
- డ్యూరబుల్ గూడ్స్ కొనుగోలులో మహారాష్ట్ర తర్వాత రెండో స్థానం
- మొబైల్ ఫోన్ల విప్లవంతో తగ్గుతున్న టీవీ ప్రాధాన్యత
- మూతపడే దిశలో కొన్ని వినోద ఛానళ్లు
- ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి నివేదికలో ఆసక్తికర అంశాల వెల్లడి



సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో తెలంగాణ రాష్ట్రం మరోసారి దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని గృహాల్లో అత్యధికంగా ల్యాప్‌టాప్‌లు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. గత పదేళ్లలో 10 శాతంగా ఉన్న ల్యాప్‌టాప్‌ల వినియోగం ప్రస్తుతం 19 శాతానికి చేరుకుంది. ఐటీ విస్తరణ, డిజిటల్ వర్క్ కల్చర్, విద్యా అవసరాలే ఈ వృద్ధికి ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి 'చేంజెస్ ఇన్ డ్యూరబుల్ గూడ్స్ ఓనర్షిప్ ఇన్ ఇండియా' పేరుతో తాజా నివేదికను విడుదల చేసింది.

వివరాలు 2లో..

## ప్రతిష్ఠకు చిహ్నంగా మారిన కారు

- వాయునాణ్యత క్షణతకు కారణాలు తెలుసుకోలేరా?
- సీఏక్యూఎం వైఫల్యం.. రైతుల్ని నిందించడం సరికాదు: సుప్రీంకోర్టు

ఢిల్లీ: వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) తన బాధ్యతల నిర్వహణలో విఫలమైందని సుప్రీంకోర్టు మంగళవారం పెదవి విరిచింది. రెండు వారాల్లో నిపుణుల సమావేశం నిర్వహించి కాలుష్య పరిస్థితి మరింతగా దిగజారిపోతుండటానికి కారణాలపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం ఆదేశించింది. వాహన రద్దీని తగ్గించడానికి ఢిల్లీ సరిహద్దుల్లోని టోల్ ప్లాజాలను మూసివేయడమో,

వివరాలు 2లో..






## యూపీలో 2.89 కోట్ల ఓట్లు తొలగింపు

### సవరించిన ముసాయిదా జాబితా విడుదల

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) అనంతరం ఓటరు ముసాయిదా జాబితాను ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) నవదీప్ రిణవా మంగళవారం విడుదల చేశారు. మొత్తం 12.55 కోట్ల మందిని ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చారు. 2.89 కోట్లు(18.70 శాతం) ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఓటర్ల పేర్లు లేకపోయినా, తప్పిదాలున్నా ఆన్‌లైన్ వేదికగా అభ్యంతరాలు తెలిపేందుకు నెల రోజులు(ఫిబ్రవరి 6 వరకు) గడువు కల్పించారు. అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత ఎస్ఐఆర్ తుది జాబితా మార్చి 6న విడుదల చేయనున్నట్లు నవదీప్ వెల్లడించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో 15.44 కోట్లమంది ఓటర్లు ఉన్నారు. తొలగించిన ఓట్లలో.. 2.57 కోట్ల మంది సంబంధిత చిరునామాలో లేరని వెల్లడైంది. 46.23 లక్షల మంది మరణించగా, 25.27 లక్షల మందికి ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు హక్కు ఉందని నవదీప్ తెలిపారు. ఈ ముసాయిదా జాబితాను సమాజ్‌వాదీ పార్టీ సహా వివిధ ప్రతిపక్షలు తీవ్రంగా ఖండించాయి. ఓటర్ల కోపం తీవ్రస్థాయికి చేరకముందే జాబితాను సవరించాలని ఈసీని అఖిలేశ్ యాదవ్ హెచ్చరించారు.

# డిజిటల్ జోరులో తెలంగాణ..

## ల్యాప్‌టాప్‌ల వినియోగంలో దేశంలోనే టాప్!

- మొదటి పేజీ తరువాయి

**ఖర్చుల్లోనూ మనమే మేటి**

దీర్ఘకాలిక వినియోగ వస్తువుల (డ్యూరబుల్ గూడ్స్)పై ఖర్చు చేయడంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. మహారాష్ట్రలో సగటు వ్యక్తి ఖర్చు రూ. 1,191 ఉండగా, తెలంగాణలో రూ. 1,022గా నమోదైంది. రాష్ట్రంలోని పట్టణాల్లో 63 శాతం మందికి సొంత వాహనాలు ఉండగా, 58 శాతం ఇళ్లలో ఫ్రిజ్‌లు, 45 శాతం ఇళ్లలో ఎయిర్ కూలర్లు ఉన్నాయి. అయితే వాషింగ్ మెషీన్ల వినియోగం మాత్రం 33 శాతానికే పరిమితం కావడం గమనార్హం.

**కర్ణాటకను మించిన వృద్ధి**

టెక్ హబ్‌గా పేరున్న కర్ణాటకలో ల్యాప్‌టాప్ వినియోగ వృద్ధి 2 నుంచి 3 శాతానికే పరిమితం కాగా, తెలంగాణలో ఇది ఏకంగా 9 శాతం పెరగడం విశేషం. ఇది రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు, ఉత్పాదకత మెరుగుదలకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. కాగా, మొబైల్ ఫోన్ల వినియోగం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అన్వయించుకుని నిత్యావసరంగా మారింది.

**తగ్గుతున్న టీవీల ప్రభ**

మొబైల్ డేటా చౌకగా లభించడం, ఓటీటీల హవా పెరగడంతో టీవీల ప్రాధాన్యం క్రమంగా తగ్గుతోంది. తెలంగాణలోని పట్టణాల్లో 80 శాతం, గ్రామాల్లో 60 శాతం మందికి టీవీలు ఉన్నప్పటికీ, వినోదం కోసం మొబైల్ ఫోన్లకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. యాడ్స్ గోల లేకపోవడం, నచ్చిన సమయంలో నచ్చిన కంటెంట్ చూసే వీలుండటంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మొబైల్స్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ మార్పుల వల్ల నిర్వహణ భారం పెరిగి కొన్ని వినోద ఛానళ్లు మూతపడే పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రేవంత్ చాణుక్య రాజకీయం



రాజకీయాలలో ఉన్న వారంతా వ్యూహాలు రచిస్తుంటారు. అందులో కొంతమంది వ్యూహాలు మాత్రమే సఫలీకృతం అవుతుంటాయి. తెలంగాణ రాజకీయాలలో వ్యూహాలు రచించి.. పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో మొదటి నుంచి కూడా కేసీఆర్ అగ్రస్థానంలో ఉండేవారు. 2014 నుంచి 2018 వరకు ఆయన వ్యూహాలు తెలంగాణలో విజయవంతం అయ్యాయి. ఎప్పుడైతే రెండు ఉప ఎన్నికలలో ఓటమి.. గ్రేటర్‌హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు రావడంతో.. కెసిఆర్ కు బ్యాడ్ టైం మొదలైంది. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు మీడియాను తన అదుపులో ఉంచుకునేవారని.. భయభ్రాంతులకుగురి చేసేవారని ఆరోపణలు వినిపించేది. ఇప్పుడు కెసిఆర్ అధికారానికి దూరం కావడంతో.. కేవలం గులాబీ మీడియా మాత్రమే ఆయన దండకం చదువుతోంది. ఇక మిగతా మీడియా పెద్దగా పట్టించుకోవడంలేదు.ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆర్థికంగా బలమైన, రాజకీయంగా శక్తివంతుడైన కేసీఆర్ ను ఎదిరించి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాదు, కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో విజయవంతం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మూడోవంతు స్థానాలను గెలుచుకోవడంలోరేవంత్ రెడ్డి సఫలీకృతులయ్యారు. ఇదే ఊపులో పురపాలకం, నగర పాలక ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు.. గులాబీ మీడియా, గులాబీ పార్టీ అనుకూల సోషల్‌మీడియా ప్రతిరోజు బురద చిమ్ముతున్నప్పటికీ.. ఇష్టానుసారంగా విష ప్రచారం చేస్తున్నప్పటికీ రేవంత్ రెడ్డి ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. పైగా తనకు ఎదురవుతున్న ప్రతిబంధకాల నుంచి విజయ పాఠాలు నేర్చుకుంటున్నారు.ఇటీవల నూతన సంవత్సరం సందర్భంగా రేవంత్ రెడ్డి ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ స్వగృహానికి వెళ్లారు. ఆయనతో చాలాసేపు మాట్లాడారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.వాస్తవానికి ఒక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లడం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే రాజకీయంగా వ్యూహాలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి కాస్త విభిన్నమైన శైలి. ముఖ్యంగామీడియాతో అనుకూలంగా ఉండడం.. మీడియా పెద్దల సలహాలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ముందు వరుసలో ఉంటారు. పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత ఆయన ఎన్టీవీ, టీవీ5, ఏబీఎన్ ఆంధ్రజ్యోతికార్యాలయాలకు వెళ్లారు. తనకు సపోర్ట్ ఇవ్వాలని కోరారు. ఆ చానల్స్ యాజమాన్యాలతో నేరుగా భేటీ అయ్యారు.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకతను వారికి చెప్పారు. వారి దగ్గర నుంచి సలహాలు కూడా స్వీకరించారు. వాటిని రేవంత్ రెడ్డి అమల్లోపెట్టి అధికారంలోకి వచ్చారు.అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఆ మీడియా సంస్థలను దూరం పెట్టలేదు. అలాగని తనకు భజన చేసుకునేమాధ్యమాలుగా మార్చుకోలేదు. ప్రభుత్వపరంగా తాను వేగంగా పరిపాలన సాగిస్తూనే.. మీడియా పరంగా ఆ చానల్స్ యాజమాన్యాల సపోర్ట్ కోరారు. తద్వారా యాజమాన్యాలు కూడా రేవంత్ కు సుముఖంగా మారిపోయాయి. ఫలితంగా రేవంత్ చాణక్యం ఫలవంతమై.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సరికొత్త శకాన్ని ఆవిష్కరిస్తుంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీపై ఏమాత్రం ప్రజలకు నమ్మకం లేని స్థితిలో.. రేవంత్ రెడ్డి పార్టీ పగ్గాలు అందుకున్నారు. సీనియర్ విమర్శలు చేస్తున్నప్పటికీ.. కుర వృద్ధులు అడ్డగోలుగా మాట్లాడుతున్నప్పటికీ.. కెసిఆర్ అడ్డు పుల్లలు వేస్తున్నప్పటికీ.. వాటన్నింటిని తట్టుకొని రేవంత్ రెడ్డి ఇక్కడ దాకా వచ్చారు. రాజకీయాలలో చాణక్యాన్ని ఎలా ప్రదర్శించాలో నిరూపించి చూపిస్తున్నారు. ఇదే సమయంలో తాను వేస్తున్న ఉచ్చుల్లో గులాబీ పార్టీ నాయకులు పడి గిలగిల కొట్టుకుంటున్నారు. ఒకప్పుడు ఈ పరిస్థితి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఉండేది. ఇప్పుడు రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ పార్టీ అప్పర్ హ్యాండ్ ప్రదర్శిస్తోంది.. కాకపోతే అధికారంలోకి ఉన్నామని రేవంత్ రెడ్డి తల బిరుసుతనాన్ని ప్రదర్శించడం లేదు. కేవలం ప్రజలు ఇచ్చిన అవకాశం లాగానే దీన్ని చూస్తున్నారు. అందువల్లే గులాబీ పార్టీ నేతలు ఏ స్థాయిలో ఆరోపణలు చేసినప్పటికీ.. రేవంత్ రెడ్డికి వ్యతిరేక ఫలితం రావడం లేదు. వ్యతిరేక స్వరం వినిపించడం లేదు.

# కవితమ్మ శపథం

**హైదరాబాద్, జనవరి 6,**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గులాబీ కోటలో ముసలం పుట్టిందన్న వార్తలకు బలం చేకూర్చుతూ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. శాసన మండలివేదికగా ఆమె చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉద్యమ పార్టీగా ఎదిగిన బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, తన తండ్రి స్థాపించిన పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకుంటున్నట్టుప్రకటించారు. ఇన్నాళ్లు సాంస్కృతిక వేదికగా ఉన్న తెలంగాణ జాగృతిని ఇకపై పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారుస్తున్నట్లు ప్రకటించారు.శాసన మండలిలో కవిత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడంచర్చనీయాంశమైంది. ఆమె మాటల్లో తీవ్రమైన ఆవేదన, ఆగ్రహం స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా "ఇది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ" అని ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ అంతర్గత విభేదాల తీవ్రతను బయటపెట్టాయి. పుట్టింటి బంధాలను తెంచుకుని బయటకు వస్తున్నానని చెప్పడం ద్వారా, కేసీఆర్ కుటుంబంలోనూ, పార్టీలోనూ ఆమెకు దక్కిన ప్రాధాన్యతపై, లేదా ఆమె ఎదుర్కొన్న అవమానాలపైఅనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ ఇప్పుడు ఉద్యమ ద్రోహులకు పునరావాస కేంద్రంగా మారిందని ఆమె విమర్శించడం గమనార్హం.తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ పండుగ ద్వారా సాంస్కృతికపునరుజ్జీవనానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థ ఇప్పుడు రాజకీయ అవతారం ఎత్తనుంది. ఈ మేరకు కవిత కీలక ప్రకటన చేశారు. దీంతో జాగృతి ఇకపై కేవలం ఎన్జీవోగా కాకుండా, ఎన్నికల కమిషన్ గుర్తింపుపొందిన రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ఈ కొత్త పార్టీ బరిలోకి దిగనుంది. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలే అజెండాగా ఈ పార్టీ పనిచేస్తుందని కవిత స్పష్టం చేశారు.




దీనిని బట్టి చూస్తే, కవిత కేవలం ఉద్వేగంతో ఈ నిర్ణయం తీసుకోలేదని, దీని వెనుక ఒక పక్కా రాజకీయ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది. యువతను, అసంతృప్త వర్గాలను తన వైపు తిప్పుకునేందుకు ఆమెప్రయత్నిస్తున్నారు.కవిత నిర్ణయం బీఆర్ఎస్‌కు రాజకీయంగా దెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కవితకు మహిళల్లో, ముఖ్యంగా బతుకమ్మ ఆడే తెలంగాణ ఆడబిడ్డల్లో ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. ఆమె వేరు కుంపటి పెట్టడం వల్ల బీఆర్ఎస్‌కు పడాల్సిన సంప్రదాయ ఓట్లు, మహిళా ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఉద్యమ కాలం నుంచి పనిచేస్తున్న అనేక మంది కవిత వర్గీయులు బీఆర్ఎస్‌లో ఉన్నారు. ఇప్పుడు వారుకవిత వెంటే నడుస్తారా లేక కేసీఆర్ నాయకత్వంలోనే ఉంటారా అన్నది పార్టీలో గందరగోళం సృష్టిస్తుంది. సొంత కూతురే పార్టీ విధానాలను తప్పుబడుతూ, బయటకు రావడం ప్రత్యర్థి పార్టీలకు బలమైన ఆయుధంగామారుతుంది.కవిత కొత్త పార్టీ ఏర్పాటు కాంగ్రెస్, బీజేపీలకు పరోక్షంగా లాభం చేకూర్చే అవకాశం ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా బీఆర్ఎస్ అనుకూల ఓటు చీలిపోవడం వల్ల ముక్కోణపు పోటీ ఏర్పడి, అది ప్రధాన పార్టీల సమీకరణాలను మారుస్తుంది. అయితే, కవిత జాగృతి ద్వారా సెంటిమెంట్‌ను ఎంత బలంగా రగిలిస్తారు, యువతను ఎంతగా ఆకర్షిస్తారు అనే అంశంపైనే ఆమె పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది."వ్యక్తిగాంవెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా" అని కవిత చేసిన శపథం ఆమెలోని పట్టుదలను చూపిస్తోంది. అయితే, కుటుంబ పార్టీని, బలమైన నాయకత్వాన్ని ఎదిరించి, కొత్త పార్టీతో నెట్టుకురావడం అంత సులభం కాదు.కానీ, తెలంగాణ రాజకీయ యవనికపై జాగృతి రూపంలో కొత్త పోరాటం మొదలైందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది.

## వెనెజువెలా సంక్షోభం... భారత్‌కు మేలు చేస్తుందంటున్న నిపుణులు!

అమెరికా, వెనెజువెలా మధ్య కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంపై తక్షణ ప్రభావం చూపబోవని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశ చమురు దిగుమతి వ్యయం పెరిగే అవకాశం లేదని మంగళవారం విడుదలైన ఒక నివేదిక స్పష్టం చేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు సరఫరా అవసరానికి మించి (గ్లట్ మోడ్) ఉండటం, అంతర్జాతీయ ఉత్పత్తిలో వెనెజువెలా వాటా కేవలం 1 శాతం మాత్రమే కావడం ఇందుకు ప్రధాన కారణాలు. అందువల్ల, వెనెజువెలాలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా, భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నివేదిక భరోసా ఇచ్చింది.వెనెజువెలాలో నిరూపితమైన చమురు నిల్వలు చాలా ఎక్కువని, ప్రపంచ మొత్తం నిల్వల్లో దాదాపు 19.4 శాతం అక్కడే ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక పేర్కొంది. ఈ భారీ నిల్వలను వెలికితీసి, సరఫరా పెంచేందుకు అమెరికా కంపెనీలు రంగంలోకి దిగవచ్చన్న మార్కెట్ అంచనాలతో ఇప్పటికే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామం భారత్‌కు మేలు చేసే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు."ప్రస్తుత ప్రపంచ సరఫరా పరిస్థితులు, మిగులు నిల్వలను పరిగణనలోకి తీసుకుంటే, సమీప భవిష్యత్తులో భారత్ ఆయిల్ దిగుమతి బిల్లు పెరిగే ప్రమాదం కనిపించడం లేదు" అని నివేదికలో స్పష్టం చేశారు. ఒకవేళ అమెరికా కంపెనీలు వెనెజువెలాలో ఉత్పత్తిని పెంచితే, అంతర్జాతీయంగా ధరలు మరింత తగ్గి, భారత్ సహా అన్ని దేశాలకూ లబ్ధి చేకూరుతుందని మరో నివేదికలో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**భారత్–వెనెజువెలా వాణిజ్య సంబంధాలు**

భారత్, వెనెజువెలా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం 1.9 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ నుంచి ఎగుమతులు 217 మిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 1.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ దిగుమతుల్లో పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (పీఓఎల్) వాటానే అత్యధికం. "భారత్ దిగుమతి చేసుకుంటున్న దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి వస్తున్న ముడి చమురు యూనిట్ విలువ తక్కువగా ఉంది. ఇది మన దిగుమతి ఖర్చులను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది" అని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త దీపాన్వితా మజుందార్ వివరించారు.

అయితే, గత ఐదేళ్లుగా వెనెజువెలాకు భారత ఎగుమతులు సగటున ఏటా 8.8 శాతం మేర క్షీణిస్తున్నాయి. ఇదే సమయంలో ప్రపంచానికి భారత్ చేస్తున్న మొత్తం ఎగుమతులు 6.9 శాతం వృద్ధి చెందాయి. దీన్నిబట్టి వెనెజువెలాతో వాణిజ్య సంబంధాలు మందగించాయని అర్థమవుతోంది. వెనెజువెలా నుంచి ముడి చమురును అధికంగా ఎగుమతి చేసుకుంటున్న దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత చైనా, భారత్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న చర్చల్లో చమురు దౌత్యం కీలక పాత్ర పోషిస్తోంది. కాగా, ఈ ప్రాంతంలోని భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా వెనెజువెలాలో భారీ పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు వెనకడుగు వేయవచ్చని, ఇది చమురు ఉత్పత్తి పెంపునకు అడ్డంకిగా మారవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## కాశీ ఎక్స్‌ప్రెస్ కు బాంబు బెదిరింపు

కాశీ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు కాల్ రావడంతో కలకలం రేగింది. గోరఖ్‌పూర్ నుంచి ముంబైకి వెళుతున్న కాశీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు రైలును 'మౌ' రైల్వే స్టేషన్‌లో నిలిపి తనిఖీలు చేపట్టారు. అయితే, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ఘటనపై 'మౌ' రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎలమరన్ మాట్లాడుతూ, కాశీ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు వచ్చిందని తెలిపారు. రైలు స్టేషన్‌కు చేరుకున్న వెంటనే ప్రయాణికులందరినీ కిందకు దించి, ప్రతి బోగీలో క్షుణ్ణంగా తనిఖీలు చేశామని చెప్పారు. పేలుడు పదార్థాలు ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ బెదిరింపు కాల్ ఎక్కడి నుంచి వచ్చిందో విచారణ జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం ఫోన్ కాల్ రాగానే 'మౌ' పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్‌తో కలిసి రైల్వే స్టేషన్‌కు చేరుకుని తనిఖీలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు.

## కవితకు మద్దతుగా ఆమె ఇంటి వద్దకు భారీగా తరలివచ్చిన అభిమానులు

- మొదటి పేజీ తరువాయి

కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి... తెలంగాణ జాగృతి జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. "ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కవితకు అండగా ఉంటాం. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల కోసం పనిచేస్తాం" అని నినదించారు.

మరోవైపు, రాజకీయ శక్తిగా అవతరించబోతున్నామంటూ కవిత చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమయింది. కవిత రాజకీయ పార్టీని ప్రకటిస్తే... రాష్ట్ర రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పర్యావరణం బాగు కోసమే హిల్ట్ పాలసీ!

సుప్రీం కోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్ పాలసీ తీసుకొచ్చామని.. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదనే హిల్ట్ పాలసీ తీసుకొచ్చామని స్పష్టం చేశారు. పూర్వీకులు స్వచ్ఛమైన ప్రకృతిని మనకు వారసత్వంగా అందించారని.. మనం కూడా రేపటి తరానికి స్వచ్ఛమైన ప్రకృతిని అందజేస్తున్నామా లేదా అని ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రకృతి ఒకసారి నాశనమైతే తిరిగి తీసుకురాలేమని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి అందించడం మన బాధ్యత అని.. రేపటి తరాల భవిష్యత్, నేల మనుగడ కోసం హిల్ట్ పాలసీ తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు హిల్ట్ పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారన్నారు. హిల్ట్ పాలసీపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. మాపై బురద చల్లాలని విమర్శలు చేసే వారు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

## ప్రతిష్ఠకు చిహ్నంగా మారిన కారు

- మొదటి పేజీ తరువాయి

మరో ప్రాంతానికి తరలించడమో చేయాలంటూ దాఖలైన వ్యాజ్యంపై విచారణను రెండునెలలు వాయిదా వేయాల్సిందిగా సీఏక్యూఎం అభ్యర్థించడాన్ని కోర్టు తప్పు పట్టింది. ఒకటికి మించి కార్లు కలిగి ఉండే ప్రవృత్తిని నిరోధించడం ద్వారా వాయు కాలుష్యాన్ని నివారించవచ్చని న్యాయవాది రాకేశ్ ద్వివేది చేసిన సూచనపై స్పందించింది. "ప్రతిష్ఠకు చిహ్నంగా కారు మారిపోయింది. ప్రజలు తమ పొదుపు మొత్తాన్ని కారు కొనుగోలుకు వాడుతున్నారు.. సైకిళ్ల వాడకం కనుమరుగైంది" అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ధనికులు అతి ఖరీదైన కార్లకు బదులు విద్యుత్ కార్లు వినియోగించాలన్నారు. కమిషన్ ఈనెల 2న సమావేశం నిర్వహించి రెండు నెలల అనంతరం కోర్టు సమక్షనికి వస్తామని చెప్పడం సమ్మతం కాదని స్పష్టం చేశారు.

సామాన్యులు ఎలా ప్రయాణిస్తారు?

పంటవ్యర్థాల దహనం, బస్సులు, ట్రక్కులు తదితర కారణాల వల్ల దిల్లీలో కాలుష్య సమస్య తీవ్రమవుతోందని అధికారులు పేర్కొనడంపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. కాలుష్యానికి బస్సులు, ట్రక్కులే కారణమని చెప్పడం చాలా సులభమమని, వాటిని నిలిపివేస్తే సామాన్య పౌరులు ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించింది. కాలుష్యం ప్రస్తావన వచ్చినప్పుడల్లా రైతులను నిందించడం సరికాదని వ్యాఖ్యానించింది. శాస్త్రీయ ఆధారాలు సమర్పించాలని సీఏక్యూఎంను ఆదేశించింది. సంక్లిష్ట కారణమేదైనా ఉంటే దానిని గుర్తించాలని, సమర్థమైన పరిష్కారాలు అన్వేషించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.

## స్వయం పాలన దినోత్సవం, వడియారం ప్రభుత్వ పాఠశాలలో



జనవరి 06 (సీ కే న్యూస్) చేగుంట:చేగుంట / చేగుంట మండల్ వడియారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం వడియారం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు.
విద్యార్థులు టీచర్లుగా మారి తరగతులలో పాఠాలు చెప్పడం జరిగింది.అనంతరం బహుమతులు ఇవ్వడం జరిగింది. డి.ఈ. ఓ. గా నందు,ఎం.ఈ. ఓ .గా సహస్ర హెచ్ ఎమ్ గా రాము వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్ధిరాములు ఉపాధ్యాయులు వసంత, అమరేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెనిజులా దేశ అధ్యక్షుడు మధురో దంపతులను వెంటనే విడుదల చేయాలి:-జxuఖ.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 6.
అమెరికాఅక్రమంగా వెనిజులా అధ్యక్షులు మధురో దంపతులను అమెరికా దేశంలోని న్యూయార్క్ జైల్లో బందీలుగా ఉన్న వారిని బేషరతుగా విడుదల చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ డిమాండ్ చేశారు.
వెనిజులా అధ్యక్షుడు మధురో దంపతులను విడుదల చేయాలని సిఐటియు వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో నల్ల బట్ట తో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ వెనిజులా దేశంలోని చమురుబావులను కొల్లగొట్టడం కొరకు దేశ రాజధాని కరాకస్ పై అమెరికా ట్రంప్ క్షిపణులు రాకెట్లతో భీకర దాడులు చేసి ఏడు చోట్ల బాంబు పేలుతో విధ్వంసం సృష్టించారు బెడ్ రూమ్ లో ఉన్న దేశ అధ్యక్షుడు మధురో ఆయన భార్య ను బందీలుగా యుద్ధ నౌకలో తీసుకువెళ్లి అమెరికా దేశంలోని న్యూయార్క్ జైల్లో నిర్బంధించడం హేయమైన చర్యఅని,తీవ్రంగా ఖండించాలని ప్రజలని కోరారు.
అమెరికా సామ్రాజ్యవార్థకాంక్షతో ఒక స్వతంత్ర దేశమైన వెనిజురులపై దాడి చేయడం దేశ అధ్యక్షుని కిడ్నాప్ చేయడం అమెరికా నిరంకుశ ధోరణికి పరాకాష్ట అని అన్నారు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి స్వతంత్రం సాధించిన భారతదేశం గతంలో యుద్ధాలకు వ్యతిరేకంగా నిలిచిన వారసత్వాన్ని కొనసాగిస్తూ అమెరికా దుశ్చర్యను ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు వెనిజులా ఉన్న చమురు నిలవులపై ఆధిపత్య పోరుకోసమే ఈ దాడి జరిగిందని విమర్శించారు వెంటనే వెనుజులా దేశ అధ్యక్షుడు మధుర దంపతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు
ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొండే నరసింహ చెరుకు అంజయ్య తాళ్ల సత్తయ్య రామ్మూర్తి వికృతి రాములు లలిత రేణుక తదితరులు పాల్గొన్నారు

## ధర్మసాగర్ సెంటర్లో ఆటో డ్రైవర్ల భద్రతా కార్యక్రమం




సీకే న్యూస్ జనవరి 6 మంగళవారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్.స్థానిక ధర్మసాగర్ పోలీసులు ధర్మసాగర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీధర్ రావు ఆదేశానుసారం ధర్మసాగర్ సెంటర్లో ఆటో డ్రైవర్ల కోసం జాతీయ రహదారి భద్రతా మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లకు వాహన డాక్యుమెంట్లు, లైసెన్స్, ఓవర్ స్పీడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, రోడ్ క్రాసింగ్ సక్రమంగా లేకపోవడం, ఇతర ట్రాఫిక్ భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ ఎస్సై. ఎల్. దిలీప్, ధర్మసాగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎంహెచ్వో బానోత్ తుకారాం రాథోడ్

సీకే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాధావత్ హోథిరామ్ నాయక్ :



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నీ సందర్శించిన డిఎంహెచ్వో బానోత్ తుకారాం . రాథోడ్. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుచున్న ఆశ డే సందర్భంగా ముఖ్యఅతిథిగా డిఎంహెచ్వో బానోత్ తుకారాం రాథోడ్ ను స్థానిక మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆశ డే సందర్భంగా ఆశల వర్కర్లకు శుభాకాంక్షలు తెలియజేసి ఈరోజు శ్వాస సంబంధించి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పటల్ సిబ్బంది పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. హాస్పిటల్ లో ఉన్న రికార్డ్స్ అన్ని పరిశీలించారు. హాస్పిటల్లో ఎఉన్న రోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు రక్తహీనత మరియు కాలుష్యం జాగ్రత్తగా చూసుకోవాలని తెలియజేశారు. హాస్పటల్లో ఉన్న మెడిసిన్ కొరతపై విలేకరి పరిశీలించిన పాత స్టాక్ అయిపోయిందాని ,కొత్త స్టాకు త్వరలో వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మెడికల్ ఆఫీసర్స్, స్టాఫ్ నర్స్ , ఏఎన్ఎంలు మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# నేలమ్మకు పునరుజ్జీవం - పంట వ్యర్థాలతో బయోచార్...

- భూమి ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ సంరక్షణకు బయోచార్ వినియోగం కీలకం
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్...



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్), జనవరి 06,చుంచుపల్లి మండలం గరిమెళ్ళపాడు నర్సరీ ఆవరణలో ఆధునిక, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై, ముఖ్యంగా బయోచార్ వినియోగంపై మంగళవారం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ బయోచార్ నిపుణులు పరశురం కైలాస్ అఖరే ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లాలో విస్తారంగా లభ్యమయ్యే పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్ప వంటి పంట వ్యర్థాలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో బయోచార్ తయారు చేసే విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఇనుముతో తయారుచేసిన పరికరంలో పంట అవశేషాలను నియంత్రిత ఉష్ణోగ్రత వద్ద కాల్చి నాణ్యమైన బయోచార్ ఉత్పత్తి చేసే విధానాన్ని నిపుణులు వివరించారు. అనంతరం తయారైన బయోచార్ను గోమూత్రం, ఆవు పేడ మిశ్రమంలో 15 రోజుల పాటు ఉంచి సక్రియం (యాక్టివేషన్) చేసి ఎరువుగా వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ విధానం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూమి సారవంతత మెరుగుపడటంతో పాటు తేమ నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలు సాగు అవుతున్నాయని తెలిపారు. పంట కోత అనంతరం రైతులు పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్పను పొలాల్లోనే కాల్చడం వల్ల నేలలోని విలువైన సూక్ష్మజీవులు పూర్తిగా నాశనం అవుతున్నాయని, దీంతో పాటు సేంద్రియ పదార్థం దగ్ధమై భూమి సారవంతత గణనీయంగా తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ వాతావరణ కాలుష్యానికి కారణమవుతూ మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్రమైన హానిని కలిగిస్తోందన్నారు. ఇకపై ఏ రైతు పత్తి కట్టెను పొలాల్లో కాల్చకుండా బయోచార్ తయారీకి ఉపయోగించాలన్నారు.
బయోచార్లో ఉన్న సూక్ష్మ రంధ్రాల కారణంగా పంటలకు నీరు పెట్టిన సమయంలో యూరియా తదితర పోషక ఎరువులు వృథా కాకుండా అందులోనే నిల్వ ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ పోషకాలు నెమ్మదిగా పంటలకు అందడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. బయోచార్ను నేల తల్లికి అర్పించినట్లయితే, నేల తల్లి మనకు మెరుగైన ఫలితాలను అందిస్తుందని కలెక్టర్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ఈ విధానాన్ని రైతులు విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.
అదేవిధంగా బయోచార్ వినియోగం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా డ్రైనేజీలు, పౌల్ట్రీ షెడ్లు, పశువుల శాలలు, చెత్త నిల్వ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో కూడా విస్తృతంగా ఉపయోగించవచ్చని తెలిపారు. దీని వల్ల దుర్వాసనలు తగ్గి గాలి పరిశుభ్రమవడంతో పాటు జీవన వాతావరణం మెరుగుపడుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యానికి కూడా బయోచార్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు.
ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బయోచార్ను పెద్ద ఎత్తున తయారు చేసి వినియోగించేందుకు రైతులు, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు, పంచాయతీ సమన్వయంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో బయోచార్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ విధంగా బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు జిల్లాలో సుస్థిరమైన, పర్యావరణహిత వ్యవసాయ విధానాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గ్రామ సర్పంచ్ వాడే రాములు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మ, ఎన్ఎస్ఎస్ అధికారులు వేముల కామేశ్వరరావు, శ్రీదేవి, ఎన్సిసి ఇంచార్జ్ ధర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేష్,రాంబాబు, బూర్గంపాడు, టేకులపల్లి, చంద్రుగొండ, పాల్వంచ, దుమ్ముగూడెం, జూలూరుపాడు, గుండాల మండలాల ఎంపీడీవోలు అధ్యాపకులు రాజ్ కుమార్ సూపర్డెంట్ విజయ్ ప్రసాద్, వార్డు మెంబర్లు,విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మారోత్సవాలలో భాగంగా.

- వలిగొండలో ట్రస్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన సదస్సులి.
- జిల్లా నాయకులు పాలకూర్ల వెంకటేశం సమక్షంలో.





సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 6. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలోని ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు రోడ్డు భద్రత మారోత్సవాలలో భాగంగా రోడ్ల ప్రమాదాల నివారణ అవగాహన కొరకు అంబేద్కర్ చౌరస్తా నుండి మెజీషియన్ రామకృష్ణ కళ్ళకు గంతలు కట్టుకొని సాయి గణేష్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ కుంభ వెంకట పాపిరెడ్డి మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ ట్రస్మ జిల్లా అధ్యక్షులు పాలకూర్ల వెంకటేశం గౌడ్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ గౌడ్ లు పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. వారు మీడియాతో మాట్లాడుతూ సెల్ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని ప్రమాదాలకు దూరంగా ఉండాలని మత్తు పానీయాలు సేవించి డ్రైవింగ్ చేయరాదని తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చరాదని వారన్నారు. నేటి బాలలే రేపటి ఆదర్శ పౌరులుగా ఉండాలని అన్నారు. అధికారులు పిల్లలకు భద్రత సూక్తులు నిబంధనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాంటిసోరి కరస్పాండెంట్ కొండూరు బాలరాజు గౌడ్ , కొంతం బిక్షపతి గురునాథపల్లి మల్లేశం ధనలక్ష్మి మల్లేశం మల్లం వెంకటేష్ మారగోని విష్ణు గౌడ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాఘవపురం అంగన్వాడీ లో పిల్లలకు యూనిఫాం పంపిణీ



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి – మండల పరిధి లోని రాఘవపురం అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం ద్వారా వచ్చిన యూనిఫామ్ ను సర్పంచ్ కంపల్లి కోటమ్మ, ఉప సర్పంచ్ అబ్బూరి మహేష్ పిల్లలకు మంగళవారం నాడు పంపిణీ చేశారు.అనంతరం అంగన్వాడీ సిబ్బంది సర్పంచ్,ఉప సర్పంచ్ లను ఘనంగా శాలువతో సన్మానించారు,ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త సిహెచ్ కనకమ్మ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంబాబు, గ్రామ మహిళలు దొబ్బల బేబీ, సుజాత, నిర్మల, వడ్డె కల్పన, అర్చన, పయ్యావుల మహేశ్వరి, అశోక్, సింగారపు లక్ష్మి, దొబ్బల రవి,పంచాయతీ కార్యదర్శి సురేష్ పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు .
మండల పరిధి లోని రాఘవపురం అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం ద్వారా వచ్చిన యూనిఫామ్ ను సర్పంచ్ కంపల్లి కోటమ్మ, ఉప సర్పంచ్ అబ్బూరి మహేష్ పిల్లలకు మంగళవారం నాడు పంపిణీ చేశారు.అనంతరం అంగన్వాడీ సిబ్బంది సర్పంచ్,ఉప సర్పంచ్ లను ఘనంగా శాలువతో సన్మానించారు,ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త సిహెచ్ కనకమ్మ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంబాబు, గ్రామ మహిళలు దొబ్బల బేబీ, సుజాత, నిర్మల, వడ్డె కల్పన, అర్చన, పయ్యావుల మహేశ్వరి, అశోక్, సింగారపు లక్ష్మి, దొబ్బల రవి,పంచాయతీ కార్యదర్శి సురేష్ పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు .

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు అవగాహన సదస్సు.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి : –చింతకాని మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చింతకాని శాఖ ఆధ్వర్యంలో బ్రాంచ్ మేనేజర్ మంగళవారం నాడు కళాజాత కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కళాజాత కార్యక్రమంలో మాట్లాడుతూ బ్యాంక్ లో ఇచ్చే ఋణాల్ని మరియు సైబర్ ఫోన్ కాల్స్ విషయంలో సైబర్ ఇన్సూరెన్స్ విషయంలో చాలా జాగ్రత గా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మరియు బ్యాంకు మిత్ర పాల్గొన్నారు.

## తన ఇంటి నిర్మాణం కోసం అనుమతి లేకుండా, పంచాయతీ ట్రాక్టర్ ను ఇష్ట రాజ్యాంగ వాడకం,



జనవరి 06 (సీ కే న్యూస్) చేగుంట:చేగుంట / మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామంలో గ్రామ కార్యదర్శి అనుమతితో సంబంధాలు చేసుకొని ఫీల్డ్ అసిస్టెంట్ జంగం సత్తయ్య తన ఇంటి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకు ట్రాక్టర్ వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు రోజురోజుకు ఫీల్డ్ అసిస్టెంట్ ఆగడాలు మితిమీరిపోతున్నాయని మాసాయిపేట ఎంపీడీవో కు తెలిపారు, గతంలో సర్పంచ్ ఎలక్షన్ల భాగంగా మనోహర్ నాయక్ ను సర్పంచికి బలపరిచి అతనితో ఓట్లు వేయాలని గ్రామంలో చావడి దగ్గర ప్రచారంలో పాల్గొన్నారు అని ఎంపీడీవో కు తెలిపారు అయినా గాని ఎంపీడీవో ఎలాంటి విషయాలు తెలపడం లేదని నిమ్మకు నీరతునట్లు కార్యదర్శి రమేష్, ఎంపీడీవో ఉంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు ఇప్పటికైనా గతంలో చేసిన పనులను బట్టి ఫీల్డ్ అసిస్టెంట్ సత్తయ్యను గవర్నమెంట్ రెండు సంవత్సరాలు ఫీల్డ్ అసిస్టెంట్ పదవిలో నుండి తొలగించినారు అతని స్థానంలో కుమారుని పెట్టి రాజకీయం నడిపించారు అనంతరం గత కాలం గడిచిన కొద్దీ అధికారులతో మంచి చేసుకుని మళ్లీ కుమారుని పక్కనపెట్టి ఫీల్డ్ అసిస్టెంట్ పదవిలోకి వచ్చాడు అక్కడి నుంచి ప్రైవేట్ గా భూములు కొలుచుకుంటూ వెయ్యి రూపాయలు ప్రైవేట్ గా తీసుకుంటూ అదేవిధంగా మళ్లీ ఉపాధి పనులు చేపిస్తూ లేని వారివి హాజీర్లేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు ప్రస్తుతం ఇష్టం వచ్చినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ రాజకీయం చేసుకుంటూ తన ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం యంత్రాలు వాడుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు ఎంపీడీవోకు తెలిపిన గాని పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు,

# అమెరికా సామ్రాజ్యవాది ఆధిపత్య, దురాక్రమణ చర్యలపై ఖండన

**సికే న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్** :వెనెజువెలా ప్రజలపై అమెరికా చేపట్టిన చట్టవిరుద్ధమైన చర్యలను భారత ప్రభుత్వం ఖండించాలి.వెనెజువెలాలో తిష్టవేసిన అమెరికా సైన్యం వెంటనే వెనక్కి వెళ్ళాలి. నికోలస్ మదురో, అతని బార్యను వెంటనే విడుదల చేయాలని డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మదహనం.సిపిఎంనగేష్,పీఓడభ్ల్యూ(విముక్తి) పి.సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నేతలు.లాటిన్ అమెరికా కు చెందిన వెనెజువెలా కరాకస్ పై అమెరికా సామ్రాజ్యవాది డోనాల్డ్ ట్రంప్ చేపట్టిన వైమానిక, రహస్య సైనిక దొంగల ముఠా చర్యలను వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ముక్త కంఠంతో ఖండించాయి. 2026, జనవరి-06, మంగళవారం రోజున, మేడ్చల్, కాప్రా, జవహర్ నగర్ జీహెచ్ఎంసి, బాలాజినగర్, అంబేద్కర్ విగ్రహం దగ్గర అమెరికా ఆధిపత్య దురాక్రమణ దాడులకు వ్యతిరేకంగా సిపిఎం సీనియర్ నాయకులు నగేష్, పిఓడభ్ల్యూ(విముక్తి) పి.సునీత అధ్యక్షతన నిరసన కార్యక్రమం జరిగింది. జనవరి-3, వెనిజులాపై అమెరికా జరిపిన దాడులు, అభివృద్ధి చెందుతున్న మూడవ ప్రపంచ దేశాల ప్రజలపై జరిపిన దాడి అని అన్నారు. అమెరికాలోకి మాదకద్రవ్యాలను చేరవేస్తున్నారనే పేరిట వెనెజువెలా అధ్యక్ష భవనంపై మెరుపు దాడులకు పాల్పడి, రెండు గంటలలోనే మదురోను, అతని బార్యాను ఎత్తుకెళ్ళడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తూ, ట్రంప్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ దాడిలో సైనికులతో పాటు ప్రజలు మరణించారని, వందలాదిమంది గాయపడ్డారని గుర్తుచేశారు. గతంలో కూడా ఇలాంటి అసత్య ఆరోపణలతో ఇరాక్, లిబియా, ఆఫ్ఘన్ లాంటి దేశాలలో ఇలాంటి దాడులకే పాల్పడ్డారని, నేడు కొలంబియా, క్యూబా లాంటి దేశాల



ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాడని ఆగ్రహించారు. ప్రపంచంలోనే ఎక్కువ చమురు నిల్వలు ఉన్న దేశం వెనెజువెలా అని, వాటిని కొల్లగొట్టేందుకే డ్రగ్స్ టెర్రరిజం అనే ముద్రవేసి ఆ దేశ సార్వభౌమత్వాన్ని కాలరాచిందని మండిపడ్డారు. అంతర్జాతీయ చట్టాలను సహితం లెక్క చేయని అమెరికా సామ్రాజ్యవాది ట్రంప్ అనైతిక, చట్టవిరుద్ధమైన చర్యలను ఖండించి, వెనెజువెలా ప్రజలకు మద్దతుగా భారత ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. న్యూయార్క్ జైలులో అక్రమంగా నిర్బంధించిన మదురోను, అతని బార్యాను విడుదల చేసి, వెనెజువెలాలో మోహరించిన సైనిక బలగాలను వెనుకకు మళ్ళేలా అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ప్రధాని మోదీ ఎత్తిపట్టాలని కోరారు. చమురు నిల్వలు, అపార సంపదలు ఉన్న దేశాలపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించే క్రమంలో చేస్తున్న అన్నిరకాల అహంకార పూరితమైన దురాక్రమణ యుద్ధ బెదిరింపులు, హెచ్చరిక చర్యల పట్ల ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి జోక్యం చేసుకొని, ప్రపంచ శాంతిలో బాగంగా ప్రపంచ మానవ మనుగడకు పూనుకోవాలని కోరారు. లేనియెడల సద్దాం హుసేన్, గడాఫీలను హత మర్చినట్లుగా మదురోను, అతని బార్యాను హతమారుస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధ పిపాసి డోనాల్డ్ ట్రంప్ కు వ్యతిరేకంగా మూడవ ప్రపంచ దేశాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఈపై కార్యక్రమంలో ఇఫ్టూ షేక్ షావలి, సిపిఎం శివన్నారాయణ, బాలు, సిపిఐ దర్శనం యాదగిరి, శంకర్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ మహ్మద్ పాషామియా, టి.కాలేషా, చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, పిఓడభ్ల్యూ(విముక్తి) ఐలపు పద్మ, ఏఐటీయూసీ యాదగిరి, మల్లిక, స్వరూప, రవి నాయక్, ఎల్లన్న, రాములు, బాలరాజు, సైయద్, అబ్బు, సలావుద్దీన్, గౌస్ బాబా, వెంకటాద్రి, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# చింతకాని మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ మనోహర్



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** :చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జరిగినటువంటి ప్రతి మాసంలో జరిగే అటువంటి ఆశ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పరిచయ కార్యక్రమాలు చేసుకుని తగానంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఏ రకమైన సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే నేను మీకు మీ యొక్క సిబ్బందికి ఎల్లవేళలా అండగా ఉంటానని వారు గౌరవప్రదంగా తెలియజేసినారు అదే విధంగా పేద ప్రజలకు చేసే అటువంటి వైద్య కార్యక్రమాలు ప్రజల కు ఇంకా దగ్గరికి చేరే విధంగా చేయవలెనని మొత్తం సిబ్బందికి కొనియాడారు. మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ మరియు వైద్య సిబ్బంది అందరూ శాలువాతోని సత్కరించినారు అదేవిధంగా మండలంలోని ఉన్న ఆశలందరూ కూడా సర్పంచ్ ని ఘనంగా సన్మానించినా రూ . కథ అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అంతటిని సందర్శించి వైద్య సేవలు బేషుగా జరుగుతున్నాయని కితాబు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు వీరేందర్ కృష్ణారావు సిరాజ్ సిబ్బంది పద్మ జయమ్మ సుజాత హేమలత రాజమ్మ శ్రీను పల్లవి మొదలైన వారు పాల్గొన్నారు

# హెల్మెట్ అనేది తలకు అస్త్రం లాంటిది సీఐ శ్రీలక్ష్మి

**సీకే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాదావత్తు హాతిరాం నాయక్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గ జూలురుపాడు మండల కేంద్రంలోని పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ ఆదేశాల మేరకు జూలూరుపాడు మండల కేంద్రము లో స్థానిక పోలీస్ స్టేషన్ నుండి సాయిబాబా గుడి వద్దకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి . వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు ప్రాణాలు కాపాడుకునేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తో పాటు , బండి కాగితాలు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. హెల్మెట్ అనేది తలకు అస్త్రం లాంటిది అన్నారు. చాలామంది ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. తలకు తీవ్రగాయాలు పాలై గోల్డెన్ అవర్స్‌లో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేదంటే ఎంవీ నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధిస్తామని. హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్సై బాధావత్ రవి, ఏఎస్ఐ డివి సుబ్బారావు ఏఎస్ఐ శ్రీనివాసరావు హెడ్ కానిస్టేబుల్ దయానంద్ కానిస్టేబుల్ సూర్యం వెంకట్ రామకృష్ణ సురేష్ మరియు సిబ్బంది బండ్ల వాహనదారులు పాల్గొన్నారు

# వ్యక్తిపై బీరు సీసా కత్తితో దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

**పెబ్బేరు ఎస్ఐ యుగేందర్ రెడ్డి**





**పెబ్బేరు జనవరి06 (సి కే న్యూస్)**ఓ వ్యక్తిపై మరో యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు అయినట్టు ఎస్సై తెలిపారు.కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రంగాపురం గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన దేవర్ల నాగేంద్రం(63) సోమవారం మధ్యాహ్నం సమయంలో తన ఇంటి ముందు ఉన్న కిరాణం షాపులో మద్యం తాగుతూ ఉండగా, తన పక్కనే కొంత దూరంలో కూర్చున్న రాంపోగు వెంకటేష్,కేశపోగు విష్ణు,కావలి రవి అనే వ్యక్తులు మద్యం తాగి వెంకటేష్ అనే వ్యక్తి తన పొలం విషయంలో దేవర్ల నాగేంద్రం దగ్గర గొడవ పెట్టుకోని రాంపోగు వెంకటేష్,కేశపోగు విష్ణు,కావలి రవి బీరు సీసా పగలగొట్టి తనను చంపుతామని బెదిరించారు.మళ్లీ రాత్రి 8 గంటల సమయానికి రాంపోగు వెంకటేష్ దేవర్ల నాగేంద్రం ఇంటికి వెళ్లి తన జేబులో ఉన్న కత్తిని చూపించి బెదిరించి నిన్ను చంపుతానని తనపై దాడికి దిగినట్లు ఫిర్యాదుదారుడు దేవర్ల నాగేంద్రం ఫిర్యాదు చేశారు.ఇట్టి విషయంపై నాగేంద్రం పిర్యాదు మేరకు రాంపోగు వెంకటేష్,కేశపోగు విష్ణు,కావలి రవి అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగేందర్ రెడ్డి తెలిపారు

# అంగన్వాడి పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేసిన సర్పంచ్ పర్చ రామచంద్రరావు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో అంగన్వాడి 1,2 కేంద్రాలలో పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేసిన సర్పంచ్ పర్చ రామచంద్రరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చాలా అదృష్టంగా భావించాలని యూనిఫాం ఇవ్వడం ద్వారా ఎలాంటి భేదం ఉండదని అందరూ సమాన వీటిలో ఉంటారని అన్నారు.. పిల్లలకు సరైన పౌష్టిక ఆహారం అందించాలని కోరారు... వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేట్ పాఠశాలకు వెళ్లకుండా పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేలా కృషి చేయాలని అంగన్వాడీ టీచర్స్ ను కోరారు అంగన్వాడి సెంటర్ కు కావలసిన సదుపాయాలని కల్పిస్తానని అన్నారు .. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.అంగన్వాడి పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడి టీచర్లు సర్పంచ్ పర్చ రామచంద్ర రావు, ఉప సర్పంచ్ తంగిరాల మాదవి శాలువాతో ఘనంగా సన్మానించారు .. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ నిర్మల, జ్యోతి పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు.. ఏడిఈ ఆనంద్

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి :**

చింతకాని మండలం సీతంపేట గ్రామం పంచాయతీ ఆఫీస్ నందు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా మాట కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీ ఆనంద్ మాట్లాడుతూ విద్యుత్తు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.. విద్యుత్ శాఖ అధికారులు స్థానిక ప్రజల నుంచి విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ ఆళ్ల మణెమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు కొన్ని సమస్యలను ఏడి దృష్టికి తీసుకొచ్చారు రైతుల నుండి లూజు లైన్, మిడిల్ పోల్స్ లయన్ ఎక్స్టెన్షన్ అగ్రికల్చర్ సర్వీసులకు సంబంధించి సమస్యలు గ్రామంలో ఇళ్ళ మీద నుండి వెళ్తున్నటువంటి లైనులకు సంబంధించి



సమస్యలు మొత్తం 32 సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగినది సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఏడి ఆనంద్ తెలియపరిచినారు..ఏడిఈ ఆనంద్ గ్రామ సర్పంచ్ ఆళ్ల మణెమ్మ, ఉప సర్పంచ్ జాల రమేష్ లైన్ ఇన్స్పెక్టర్ సుధా శ్రీనివాసరావు ఎఎల్ఎం రమేష్ పాల్గొన్నారు..

# తిరుమలాపురంలో ఇంకుడు గుంటలు తవ్విన ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** ఎన్ఎస్ఎస్ నాగుల వంచ విద్యార్థులు తిరుమలాపురం గ్రామంలో ఐదో రోజు శిబిరంలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఇంకుడు గుంతలు తవ్వారు. అనంతరం గ్రామంలో ఉన్న డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగించారు. రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్ నాగులవంచ విద్యార్థులు చేపట్టిన శిబిరంలో భాగంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా గ్రామస్తులుని ఉద్దేశించి సీసీ రోడ్లపై గేదెలను కట్టేయడం వాటి మేత కోసం వరిగడ్డి రోడ్లపై వెదజల్లడం దానివల్ల డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడం కారణంగా దోమల వ్యాప్తి విస్తృతంగా ప్రబులుతున్నాయి పరిశుభ్రత పాటించకుంటే అనేక ప్రాణంతక రోగాలు మలేరియా, టైపాయిడ్, డెంగ్యూ వంటి విష జ్వరాలు బారిన పడే అవకాశం ఉందని అందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామం ఉపసర్పంచ్ గోగుల నాగమణి వార్డు సభ్యులు బండి అరుణ, ఐతం విజయ, చాపలమడుగు మధు, తిరుమలాపురం యుపిఎస్ హెచ్ఎం ఎస్ స్వాతి, ఎన్ఎస్ఎస్పిఓ జి మల్లయ్య అధ్యాపకులు వరప్రసాద్ , అయుబ్ ఖాన్, రాంబాబు వేణుగోపాల్ ,కొండలు గోగుల నరసింహారావు గోదాప్రసాద్ పాల్గొన్నారు

# పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యంత్ర మానవల మౌలిక సాంకేతికపై అవగాహన



**సి కె న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాధావత్ హాథిరాం నాయక్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గ జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో యంత్ర మానవాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరవింద్ మోటర్ అకాడమీ హైదరాబాద్ వారు హాజరై, విద్యార్థులకు యంత్ర మానవ సాంకేతికతపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

విద్యార్థులతో స్వయంగా యంత్ర మానవాల మౌలిక అంశాలపై ప్రయోగాలు చేయించి, వారి సృజనాత్మకతను ప్రోత్సహించారు. ఈ శిక్షణ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడంలో దోహదపడిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు మీరా సాహెబ్, ఉపాధ్యాయులు రాము తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకులకు మరియు కార్యకర్తలకు ఆహ్వానం

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**నేడు (బుధవారం) ఉదయం 10.30 గంటలకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ నందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ తరఫున స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచులు మరియు ఉపసర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (ఖు=)లి హాజరవుతున్నారు.

ఈ కార్యక్రమానికి మధిర నియోజకవర్గ ముఖ్య నాయకులు, గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై దిగ్విజయం చేయవలసిందిగా కోరుతున్నాను

లింగాల కమల్ రాజు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, దీ=ూ పార్టీ మధిర నియోజకవర్గం ఇంచార్జ్



# బిజెపి పార్టీ ఆధ్వర్యంలో జవహర్ నగర్ ను సర్కిల్ గా ఏర్పాటు చేయాలని డిమాండ్

- ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ప్రజావాణిలో ఫిర్యాదు
- సానుకూలంగా స్పందించిన ప్రజావాణి ఇంచార్జ్ జి చిన్నారెడ్డి





**సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :**మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షులు శ్రీ బుద్ధి శ్రీనివాస్ గారి సూచన మేరకు బిజెపి జవహర్ నగర్ పశ్చిమ శాఖ అధ్యక్షులు కళికోట కమలాకర్ గారి ఆధ్వర్యంలో.మల్కాజ్గిరి జోన్ లో జవహర్ నగర్ ను, జవహర్ నగర్ సర్కిల్ గా ఏర్పాటు చేయాలని కోరుతూ "ప్రజా భవన్" ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం.లో"ప్రజావాణి"లో అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇదే విషయంలో ప్రజా భవన్ లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా ప్రజావాణి ఇన్చార్జి జి. చిన్నారెడ్డి గారు వెంటనే స్పందిస్తూ.ఆమోదయోగ్యమైన ఈ సమస్యను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని కోరుతూ జిహెచ్ఎంసి కమిషనర్ గారికి ఫార్వర్డ్ చేయడం జరిగింది. కానీ జవహర్ నగర్ మున్సిపల్ ఆఫీస్ లేకుండా ప్రతి ఒక్క సమస్యకు అంటే డెత్ సర్టిఫికెట్ గాని, బర్త్ సర్టిఫికెట్ గాని, ఇంటి టాక్స్ పేరు మార్పిడే గాని, షాప్ లైసెన్స్ గాని,ఇలాంటి అనేక సమస్యలకు కీసర సర్కిల్ ఆఫీస్ కీ వెళ్లాలి అంటే దాదాపు 20 కిలోమీటర్లు దూరం వెళ్లి కంప్లైంట్ లేదా అప్లై చేయాల్సి.ఉంటుంది.మల్కాజిగిరి జోన్ లో జనాభా లెక్కల ప్రకారం చంద్రపురి కాలనీ 2వ డివిజన్, జవహర్ నగర్ 3వ డివిజన్ కలిపి దాదాపు 3,00,000 – మూడు లక్షలు పైచిలుకు జనాభా ఉంటుంది. యాప్రాల్ 189వ డివిజన్ 110,000 – ఒక లక్షా పదివేలు జనాభా, దమ్మాయి గూడ 4వ డివిజన్ 80,000 – ఎనబై వేలు జనాభా, షామీర్పేట్ 300వ డివిజన్ 50,000 – యాబై వేలు పైచిలుకు జనాభా, కీసర 1వ డివిజన్ 45,000 నలబై వేలు జనాభా తో ఉన్నాయి. ఇవన్నిటికీ సెంటర్ జవహర్ నగర్ డివిజన్ ఉంటుంది.కావున అన్ని డివిజన్లకు సెంటర్ మరియు అత్యధిక జనాభా ఉన్న జవహర్ నగర్ లో జవహర్ నగర్ సర్కిల్ గా పెట్టాలని మా యొక్క మనవి మరియు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ లోని రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి రంగుల శంకర్ నేత, రాష్ట్ర దళిత మోర్చా కార్యదర్శి శ్రీమతి ముత్యం సుజాత రాష్ట్ర మాజీ బీజేవైఎం అధ్యక్షులు రామ్ నాయక్, జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, జవహర్ నగర్ బిజెపి పశ్చిమ శాఖ ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల యాదగిరి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ పటేల్, కిసాన్ మోర్చా అధ్యక్షులు కొంపెల్ల చంద్రశేఖర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పందిళ్ళపల్లి టు మత్తేపల్లి బీటీ రోడ్డు నిర్మాణం నేటితో పూర్తి.

- ఇ రైయ్ రైయ్ అభివృద్ధి దారిలో ముందుకు!




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులకు ముగింపు పలికిన ఈ రహదారి,ప్రజా సంకల్పానికి సాధించిన ఘన విజయం.

ఈ కీలకమైన రోడ్డు నిర్మాణానికి రూ. 8 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు కి హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రజల అవసరాలను గుర్తించి, సహకరించిన నందిని భట్టి విక్రమార్క కి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఈ రోడ్డు నిర్మాణానికి అండగా నిలిచిన చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు కి కృతజ్ఞతలు. ఈ రహదారి కేవలం రోడ్డు కాదు గ్రామాల అభివృద్ధికి బాట, ప్రజల భవిష్యత్తుకు మార్గం. ఈ రోడ్డు ప్రజలకే అంకితం. ఇదే ప్రజా ప్రభుత్వండ ఇదే అభివృద్ధి పాలన!

జై కాంగ్రెస్.. జై భట్టి విక్రమార్క.. జై నందినమ్మ..

## ఐ పి ఎస్ శ్రీ శానావాజ్ ఖాసీం కు శుభాకాంక్షలు,
## తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అసోసియేషన్



**జనవరి 6 ( సీ కే న్యూస్) చేగుంట:**చేగుంట మండల్, ఐ పి ఎస్, డీసీఏ డైరెక్టర్ జనరల్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ శ్రీ షానావాజ్ ఖాసీం, స్టేట్ డి సి ఏ జాయింట్ డైరెక్టర్ శ్రీ రామ్ దాన్ డిసిఏ హెడ్ ఆఫీస్ లో మర్యాద పూర్వకంగా కలవనైనది. వీరికి తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పక్షాన శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడమైనది. అలాగే వారు టిటిసిడిఏకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి తోడుపునూరి రాజు కోశాధికారి పెండెం కృష్ణ కుమార్ లకు శుభాకాంక్షలు తెలియజేసినారు. తెలంగాణలోని 48 వేల మెడికల్ షాప్ ల సమస్యలను, ఏమైనా ఉన్నచో దృష్టికి తీసుకు రాగలరని తెలిపినారు, అలాగే వాటిని సానుకూలంగా స్పందించి సమస్యలను తీరుస్తామన్నారు అలాగే స్పురియాస్ మెడిసిన్స్ మీద కూడా ఏమైనా సమాచారం ఉన్నచో మా డిపార్ట్మెంట్ కు తెలియజేయగలరని టిటిసిడి ఏ ను కోరినారు. దీనికి మన టిటిసిడి సానుకూలంగా స్పందించి మీకు సహకరిస్తామని తెలియజేసినారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మెదక్ ఎంపీ



**జనవరి 06 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల్ ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ నాగభూషణం తల్లి, మంగళవారం నాడు స్వర్గస్తులైయరూ, విషయం మెదక్ ఎంపీ రఘునందన్ రావు కు విషయం తెలుపగా, హుటాహుటిగా వారు ఇబ్రహీంపూర్ గ్రామానికి చేరుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని,వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో చేగుంట మండల్ బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు చింతల భూపాల్, గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొనారు,

## హయత్‌నగర్‌లో ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ 59వ నూతన శాఖ ప్రారంభం..

**(సీ కే న్యూస్)**హయత్ నగర్‌లో ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ 59వ నూతన శాఖను ఈ నెల 8న ప్రారంభించనున్నట్లు బ్యాంక్ ప్రస్తుత చైర్మెన్ జె.వి. సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ శాఖను బ్యాంక్ పూర్వ చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే మనం ఆంజనేయులు ప్రారంభిస్తారని ఆయన పత్రికా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడ సహకార రంగంలో ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ దక్షిణ భారతదేశంలోనే నెంబర్2 స్థానంలో కొనసాగుతోందని తెలిపారు. సుమారు 110 సంవత్సరాల క్రితం స్థాపితమైన ఈ బ్యాంక్ ప్రస్తుతం రూ. 8,500 కోట్ల టర్నోవర్‌తో, 1.20 లక్షల మంది షేర్‌హోల్డర్లతో విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. బ్యాంక్ కేవలం డిపాజిట్లపైనే కాకుండా పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా రుణాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. గోల్డ్ లోన్లు, ఎంఎస్‌ఈ లోన్లు, లాకర్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వినియోగదారులకు 24 గంటల సేవలందించడమే బ్యాంక్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో మరిన్ని శాఖలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు జొన్నలగడ్డ ప్రసాద్, చిన్న కోటేశ్వర్ రావు, పెద్ది ప్రసాద్, అవని ప్రసాద్ వెంకట దుర్గతో పాటు బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ సభ

- 20న జాతీయ స్థాయి సెమినార్
- 12న కవి సమ్మేళనం
- బహిరంగ సభకు హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా
- ర్యాలీలు, సభలు, సమావేశాలతో విస్తృత ప్రచారం
- ఆహ్వాన సంఘ కార్యదర్శి భాగం హేమంతరావు




**సీకే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాదావత్ హాథీరాం నాయక్**

ఖమ్మం చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ జనవరి 18న నిర్వహిస్తున్నట్లు సిపిఐ జాతీయ సమితి -సభ్యులు,శతాబ్ది ఉత్సవాల ఆహ్వాన సంఘ కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ప్రజలు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.మంగళవారం సిపిఐ కార్యాలయంలో ఏపూరి లతాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జాతీయ స్థాయి సభ జరగడం ఇదే మొదటిసారి అని వందేళ్ల సిపిఐ సమర చరితను నేటి తరానికి తెలియజేయడంతో పాటు సమకాలిన రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ప్రమాదం, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు తదితర విషయాలను నేటి తరానికి తెలియజేసి భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసేందుకు ఈ సభ దోహదపడుతుందన్నారు.ఖమ్మం ఎస్ఆర్అండ్బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే ఈ సభకు అన్ని రాష్ట్రాల నుంచి సిపిఐ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జనవరి 19 నుంచి 21 వరకు జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఖమ్మం సప్తపది ఫంక్షన్హాల్లో జరుగుతాయన్నారు. 18న బహిరంగ -సభ సందర్భంగా స్థానిక పెవిలియన్ మైదానం నుంచి 15వేల జనసేవాదళ్ కార్యకర్తలు కవాతు చేస్తారని వీరితో పాటు కళాకారులు వృత్తి సంఘాలకు ప్రాతినిధ్యంవహిస్తూ ప్రజా సంఘాల కార్యకర్తలు ఆయా వృత్తుల వేషధారణలతో పాల్గొంటారని హేమంతరావు తెలిపారు.శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరిగే సభ జయప్రదం కోరుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.కరపత్రాలు, పోస్టర్లు,జీపుజాతాల ద్వారా ప్రచారం జరిగిందన్నారు.ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో గడిచిన నాలుగు రోజులుగా జీపుజాతాలు నిర్వహించామని ఎనిమిదిన అన్ని మండలాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు జరుగుతాయని తొమ్మిదిన జిల్లా కేంద్రం ఖమ్మంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు.10 నుంచి 14 వరకు కళారూపాల ప్రదర్శనలు ఉంటాయని ఆయన తెలిపారు.

20న జాతీయ స్థాయి సెమినార్

ఖమ్మంలో జనవరి 20న జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించడం జరుగుతుందని ఈ సెమినార్కు అన్ని వామపక్షాల జాతీయ నాయకులు హాజరుకానున్నారని హేమంతరావు తెలిపారు.సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా, సిపిఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబి, వామపక్షాల నేతలు దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. భారతదేశంలో వామపక్ష ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ జరుగుతుందన్నారు..

12న కవి సమ్మేళనం

సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పురస్కరించుకుని జనవరి 12న స్థానిక డిపిఆర్సి భవనంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు.ఈ కవి సమ్మేళనానికి ప్రముఖ కవులు సుద్దాల అశోక్ తేజ, కెవిఎల్ తో పాటు అభ్యుదయ కవులు ఖమ్మం జిల్లాకు చెందిన కవులందరిని ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు.ఇప్పటికే వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించి రచనలను సేకరించడం జరిగిందని తెలిపారు.ప్రత్యేక కవితల సంకలనాన్ని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.జనవరి 17న జాతీ య స్థాయి ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సమావేశం అంతకు ముందు ప్రత్యేక కళారూపాల ప్రదర్శన జరుగుతుందని హేమంతరావు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి,వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, ఆహ్వాన సంఘ విభాగాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన సదస్సు







**వరంగల్ సిటీ బ్యూరో. (సీ కే న్యూస్)**ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులే ఆయుధం

రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ పోలీసు అధికారుల సమన్వయంతో పోచంమైదాన్ కూడలిలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యం.సాయికుమార్, సెంట్రల్ జోన్ డిసిపి.ధార కవిత, ఏఎస్పి శుభం, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, వరంగల్ భారత్ అసియేషన్ ప్రెసిడెంట్ వలస.సుధీర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుజాత, మట్వాడ ఇన్స్పెక్టర్ కరుణాకర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీ.జయపాల్ రెడ్డి మరియు సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈ అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ మాట్లాడుతూ "రోడ్డు భద్రత పై అవగాహన అత్యంత ముఖ్యమైన అంశం అని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను నాశనం చేస్తున్న విషాద కథలుగా మారుతున్నాయని తెలిపారు.

అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం ఇవన్నీ ట్రాఫిక్ ఉల్లంఘనలుగా తెలిపారు. ఒక్క క్షణపు నిర్లక్ష్యం ఒక ప్రాణాన్ని తీస్తుంది కావున వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

రోడ్డు నియమాలను పాటించి మీ ప్రాణాలను, మీ కుటుంబాల భవిష్యత్తును కాపాడేందుకు రూపొందించబడ్డాయి. అని ట్రాఫిక్ నియమాలు పాటించడం మనందరి బాధ్యత గా తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మనందరి సామూహిక బాధ్యతగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిపి ధార.కవిత మాట్లాడుతూ "అతివేగం,

ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం చిన్న తప్పులు కావు, ప్రాణాంతక తప్పులుగా సూచించారు. రోడ్డు నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారు ప్రచురించిన ట్రాఫిక్ నియమాల పోస్టర్లను విడుదల చేశారు.

అనంతరం సుమారు 200 మంది విద్యార్థులచే ప్లకార్డులతో, నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వాహనదారులతో ట్రాఫిక్ నియమాలు పాటించేలా ప్రతిజ్ఞ చేపించారు. కూడలి వద్ద న్యాయమూర్తులు, పోలీసు అధికారులు హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు.

## మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు.. సైబర్ మోసాలు, డ్రగ్స్‌పై అవగాహన...

**(సీ కే న్యూస్)**ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో పసుమాముల, కళానగర్‌లలో కొనసాగుతున్న శీతాకాల ప్రత్యేక శిబిరం ఐదో రోజున వాలంటీర్లు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ ఆవరణలతో పాటు ప్రధాన కూడళ్లలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు యాదగిరమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఇ. యాదగిరి రెడ్డి, డా. ఎస్. శారదా దేవి పాల్గొని వాలంటీర్లను ప్రోత్సహించారు.

భోజనానంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హయత్‌నగర్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ సైబర్ మోసాలు, వాటి నుంచి రక్షించుకునే మార్గాలపై వివరించారు.

అనంతరం హయత్ నగర్ సీఐ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం..

- ఏఐఎన్‌పీఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాచన రఘునందన్..




**రంగారెడ్డి జిల్లా, జనవరి 06, (సీ కే న్యూస్)**పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) పునరుద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం కొనసాగిస్తామని ఆలిండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఎన్‌పీఎస్‌ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ స్పష్టం చేశారు. ఏఐఎన్‌పీఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు జాతీయ అధ్యక్షులు మంజీత్ సింగ్ పటేల్ ఫోన్ ద్వారా తెలియజేశారని రఘునందన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడ దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా ఉద్యోగులు కొత్త పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్/సీపీఎస్) పరిధిలో ఉన్నారని చెప్పారు. 2004 సెప్టెంబర్ 1 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ అమలు ప్రారంభమైందని గుర్తు చేశారు. ఉద్యోగం అనేది సామాజిక భద్రతకు ప్రతీక అయినప్పటికీ, సీపీఎస్‌లో ఉన్న ఉద్యోగులకు ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కూడా లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తూ సీపీఎస్ ఉద్యోగికి ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే, వారి ఖాతాలో కనీసం లక్ష రూపాయలు కూడా ఉండని పరిస్థితి ఉందన్నారు. అటువంటి పరిస్థితుల్లో పెన్షన్ లేని ప్రభుత్వ ఉద్యోగం కన్నా ప్రైవేటు ఉద్యోగమే మెరుగైనదన్న భావనను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నెలలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే ఏఐఎన్‌పీఎస్‌ఎఫ్ జోనల్ సమావేశానికి తనను ఆహ్వానించినట్లు మాచన రఘునందన్ పేర్కొన్నారు.

## విద్యుత్ సమస్యల నివారణకు చర్యలు..

**(సీ కే న్యూస్)**అబ్దుల్లాపూర్మెట్ గ్రామంలోని 4వ, 5వ వార్డుల పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాల వద్ద చెట్ల కొమ్మలు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తున్న నేపథ్యంలో, వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ నాయక్, వార్డ్ సభ్యులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి, మచ్చగొని మహేందర్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బోడుసు రాఘవేందర్ యాదవ్ కలిసి సంబంధిత ప్రాంతాల్లో పర్యటించారు. విద్యుత్ స్తంభాల కింద ఉన్న చెట్లను తొలగించి భవిష్యత్తులో కరెంట్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఈని సర్పంచ్ కోరారు. గ్రామంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# మారుతున్న సమీకరణాలు

**విశాఖపట్టణం, జనవరి 6,**
ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. ఎయిర్పోర్ట్లో ట్రయల్ రన్ కూడా పూర్తయింది. జూన్ లో విమానాశ్రయాన్ని ప్రారంభించి.. జూలై నుంచి విమాన రాకపోకలు మొదలయ్యేలా చూడనున్నారు. ఎయిర్పోర్ట్ తో ఉత్తరాంధ్ర స్వరూపమే మారనుంది. అయితే ఇప్పుడు ఏపీలోనే భోగాపురం నియోజకవర్గం ఎంతో ప్రాధాన్యత కలిగిన రాజకీయ ప్రాంతం. అందుకే అక్కడ పట్టు కోసం అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తాయి. ప్రస్తుతం ఇక్కడ జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఈ స్థానం టిడిపి తీసుకుంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. భోగాపురం లాంటి ప్రాంతంలో అధికార పార్టీ ముద్రగా చూపాలన్నది టిడిపి నుంచి వస్తున్న అభిప్రాయం. పైగా ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో పట్టున్న ప్రాంతం. అందుకే వచ్చే ఎన్నికల్లో జనసేన ను తప్పించి.. తిరిగి టిడిపికి ఈ స్థానం కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది.భోగాపురం ఎయిర్పోర్ట్ కు అనుబంధంగా పర్యాటక ప్రాజెక్టులు సైతం రానున్నాయి. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 500 ఎకరాల భూమిని రిజర్వు కూడా చేసింది. మొన్నటి ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది. కానీ రాష్ట్రస్థాయిలో కుదిరిన పొత్తుల వల్ల ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించాల్సి వచ్చింది. అయితే భోగాపురం ఎయిర్పోర్ట్ తో ఉత్తరాంధ్ర కేంద్రంగా ఈ నియోజకవర్గం మారనుంది. అందుకే ఎంత మాత్రం ఈ నియోజకవర్గాన్ని వదిలి పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ అంగీకరించదన్న టాక్ నడుస్తోంది. పైగా జనసేన ఎమ్మెల్యే పై అనేక రకాల ఆరోపణలు వస్తున్నాయి. కూటమి శ్రేణులను సమన్వయం చేసుకోలేకపోతున్నారన్న విమర్శ ఉంది. పైగా ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉండడం.. జనసేన ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో ఒక రకమైన గందరగోళం ఉంది. అందుకే ఈ నియోజకవర్గాన్ని టిడిపికి విడిచిపెట్టి.. మరో నియోజకవర్గాన్ని జనసేన ఎంచుకుంటుందన్న టాక్ కూడా నడుస్తోంది.మరోవైపు వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచి టిడిపి అభ్యర్థిగా అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు పోటీ చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. విజయనగరం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు విడిచిపెడతారని.. ఇక్కడ మాత్రం టిడిపి తీసుకుంటుందన్న టాక్ నడుస్తోంది. జనసేనకు ఇప్పటికే పాలవలస యశస్విని అనే మహిళ నేత నాయకురాలిగా ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ టికెట్ ఆశించారు. అయితే కూటమి అధికారంలోకి రావడంతో ఆమె తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవి వరించింది. అయితే ఈసారి తూర్పు కాపు సామాజిక వర్గానికి విజయనగరంలో ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తోంది కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. తూర్పు కాపు సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తోంది. అందుకు ధీటుగా కూటమి జనసేనకు టికెట్ ఇచ్చి.. తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన యశస్వినికి అవకాశం ఇస్తారని తెగ ప్రచారం జరుగుతుంది. అయితే నెల్లిమర్ల వెళ్లేందుకు అదితి గజపతిరాజు ఒప్పుకుంటారా? ఈ ప్రచారంలో నిజం ఎంత ఉంది? అనేది త్వరలో తెలుస్తుంది.

# రాయలసీమకు ద్రోహం చేసిందెవరు..

**కర్నూలు, జనవరి 6,**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ఒక్క ప్రకటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంటలు రేపింది. "రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నేనే చంద్రబాబుతో మాట్లాడి ఆపించాను" అని రేవంత్ చెప్పడమే ఆలస్యం.. ఏపీలో ప్రతిపక్ష వైసీపీ భగ్గుమంది. చంద్రబాబును 'రాయలసీమ ద్రోహి'గా చిత్రీకరిస్తూ ఆందోళనలకు దిగింది. అయితే, తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసలు నిజాలను బయటపెట్టడంతో సీన్ రివర్స్ అయ్యింది. జగన్ హయాంలోనే ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని ఆయన ఆధారాలతో సహా చూపించారు. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనల నేపథ్యంలో అసలు రాయలసీమ ఎత్తిపోతలకు బ్రేకులు వేసింది ఎవరు? 2019-24 మధ్య ఏం జరిగింది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ను ఇరకాటంలో పెట్టే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావించారు. అక్రమ ప్రాజెక్టులను ఆపడంలో తాము సఫలమయ్యామని చెప్పే ప్రయత్నంలో రాయలసీమ ఎత్తిపోతల ప్రస్తావన తెచ్చారు. దీన్ని వైసీపీ అందిపుచ్చుకుంది. తెలంగాణ సీఎంకు తలొగ్గి చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, సీమ గొంతు కోశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పలు జిల్లాల్లో నిరసనలకు దిగారు.వైసీపీ ఆరోపణలు ఇలా ఉంటే.. హరీశ్ రావు మాత్రం తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో లెక్కలతో సహా వాస్తవాలను బయటపెట్టారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల కారణంగా జగన్ అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు కొత్తగా ఆపించింది ఏమీ లేదని, అసలు అక్కడ పనులే జరగడం లేదని తేల్చి చెప్పారు. ఇది పరోక్షంగా జగన్ హయాంలో జరిగిన వైఫల్యాన్ని ఎత్తిచూపినట్లయింది.రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి, రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించాలని జగన్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం 2020లో జీవో 203ని విడుదల చేసింది. అయితే, దీనికి పర్యావరణ అనుమతులు లేవని తెలంగాణ ప్రభుత్వం అప్పట్లో ఎన్జీటీని ఆశ్రయించింది. విచారణ జరిపిన ఎన్జీటీ, పర్యావరణ అనుమతులు వచ్చే వరకు పనులు చేపట్టవద్దని స్టే ఇచ్చింది. జగన్ ప్రభుత్వం ఈ అనుమతులు సాధించడంలో విఫలమైంది. అంతేకాకుండా, ఎన్జీటీ ఆదేశాలను ధిక్కరించి పనులు చేశారన్న ఆరోపణలపై ఏపీ అధికారులకు కోర్టు ధికార నోటీసులు కూడా వచ్చాయి. ఫలితంగా, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ ను నియమించినా, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగలేదు. హరీశ్ రావు చెప్పిన పాయింట్ ఇదే. జగన్ హయాంలోనే చట్టపరమైన చిక్కులతో ప్రాజెక్టు స్తంభించిపోయింది. 2024లో జగన్ ఓడిపోయారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. టీడీపీ వచ్చి ఏడాదిన్నరే అయింది. ఎన్జీటీ స్టే ఇంకా కొనసాగుతోంది. ఈ తరుణంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చంద్రబాబును ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టాయి. ఒకపక్క తెలంగాణతో సత్సంబంధాలు కోరుకుంటున్న చంద్రబాబు, మరోపక్క రాయలసీమ సెంటిమెంట్ ను విస్మరించలేరు. రేవంత్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు స్పందిస్తూ.. "మేము ప్రాజెక్టు ఆపేస్తామని ఎక్కడా చెప్పలేదు, చట్టపరమైన అనుమతులు తెచ్చుకుని కడతాం" అని కౌంటర్ ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణలో పొలిటికల్ మైలేజ్ కోసమే ఆ వ్యాఖ్యలు చేశారని టీడీపీ వాదన.వాస్తవాలను పరిశీలిస్తే.. ఇక్కడ ఎవరూ పూర్తిగా రైట్ కాదు. ప్రాజెక్టును ఆర్భాటంగా ప్రకటించినా, పర్యావరణ అనుమతులు సాధించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. చట్టపరంగా బలమైన అడుగులు వేయలేకపోవడం వల్లే ప్రాజెక్టు ఎన్జీటీ స్టేలో చిక్కుకుంది. కాబట్టి పనులు ఆగిపోవడానికి ప్రధాన కారణం జగన్ ప్రభుత్వ వైఫల్యమే. రేవంత్ రెడ్డి 'నేను చెప్తే బాబు ఆపారు' అని అంటుంటే.. చంద్రబాబు ప్రభుత్వం నుండి గట్టి కౌంటర్ రాకపోవడం సీమ ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. కేసీఆర్ ను కార్నర్ చేయడానికి రేవంత్ వాడిన అస్త్రం.. పక్క రాష్ట్రంలో మంటలు రేపింది. అక్కడ పనులు జరగడం లేదని తెలిసీ, తానే ఆపించానని చెప్పుకోవడం పూర్తిగా రాజకీయ ఎత్తుగడ.అసలు విషయం ఏంటంటే.. ప్రస్తుతం రాయలసీమ ఎత్తిపోతల పనులు జరగడం లేదు. అవి జగన్ హయాంలోనే ఎన్జీటీ కేసుల వల్ల ఆగిపోయాయి. ఇప్పుడు కొత్తగా చంద్రబాబు ఆపిందేమీ లేదు, రేవంత్ ఆపించిందీ ఏమీ లేదు. కానీ, ఇద్దరు సీఎంల మధ్య ఉన్న దోస్తీని అడ్డం పెట్టుకుని వైసీపీ రాజకీయం చేస్తుంటే, గతాన్ని గుర్తు చేస్తూ హరీశ్ రావు వాస్తవాలను బయటపెట్టారు. అంతిమంగా రాజకీయ నాయకుల మాటల యుద్ధంలో రాయలసీమ నీటి హక్కులు పక్కదారి పడుతున్నాయన్నది చేదు నిజం.

# క్రెడిట్ వార్.....

**విజయనగరం, జనవరి 6, :**
భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ అంశం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. ఈ ఎయిర్పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంపై టీడీపీ , వైసీపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్ట్ ఎక్కువగా ముందుకు వెళ్లిందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అనుమతులు, కోర్టు వివాదాల పరిష్కారం, భూసేకరణ, శంకుస్థాపన అన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని వారు గుర్తు చేస్తున్నారు. దాదాపు 80 శాతం పనులు అప్పుడే పూర్తయ్యాయని వైసీపీ వాదన.దీనికి టీడీపీ తీవ్రంగా స్పందిస్తోంది. ఒకప్పుడు జగన్ విపక్ష నేతగా ఉన్న సమయంలో భోగాపురంలో ఎయిర్పోర్ట్ అవసరమా అని ప్రశ్నించిన వీడియోలను బయటకు తీసి, అదే మీ అభివృద్ధి దృష్టికోణమా అంటూ కౌంటర్లు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వేడి పెరుగుతున్నప్పటికీ, ప్రాజెక్ట్ మాత్రం కీలక దశకు చేరుకుంది.ఇదిలా ఉండగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలు ప్రాజెక్ట్కు కొత్త ఉత్సాహం ఇచ్చాయి. ఢిల్లీ నుంచి వాణిజ్య విమానంలో నేరుగా భోగాపురం ఎయిర్పోర్ట్లో ల్యాండ్ అయి ట్రయల్ రన్ విజయవంతం కావడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఎయిర్ ఇండియా (సహకారంతో గ్రీన్ఫీల్డ్ ఎయిర్పోర్ట్లో తొలి విమానం దిగడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం కూడా విశేషమని పేర్కొన్నారు.భోగాపురం ఎయిర్పోర్ట్కు సంబంధించి అనుమతులు 2016లోనే అప్పటి సివిల్ ఏవియేషన్ మంత్రి అశోక్ గజపతి రాజు తెచ్చారని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 18 నెలలుగా నిరంతర సమీక్షలతో పనులను వేగవంతం చేశామని చెప్పారు. డిసెంబర్ నాటికి పూర్తి చేయాల్సిన పనులను ఆరు నెలలు ముందుగానే పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ఎల్ అండ్ టీ , జీఎంఆర్, డీజీసీఏ ( అధికారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. భూములు ఇచ్చి సహకరించిన స్థానిక రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భోగాపురం ఎయిర్పోర్ట్



ఉత్తరాంధ్ర ప్రాంతానికి వరల్డ్ క్లాస్ ఏవియేషన్ హబ్గా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పుడు శంషాబాద్ఎయిర్పోర్ట్పై వచ్చిన విమర్శలకు ఇదే సమాధానమని అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల భవిష్యత్ ఈ ఎయిర్పోర్ట్తో మారుతుందని చెప్పారు. టూరిజం, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని అంచనా వేశారు.ఇంకా నాలుగు నుంచి ఐదు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ఎయిర్పోర్ట్ ప్రారంభం కానుందని తెలిపారు. ఒడిశా , రాయపూర్ (ప్రాంతాల ప్రజలకు కూడా ఇది ఉపయోగపడుతుందని, ఎయిర్ కనెక్టివిటీ మెరుగవుతుందని అన్నారు. మొత్తంగా భోగాపురం ఎయిర్పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలికిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మళ్లీ రేసులోకి ధర్మాన

**శ్రీకాకుళం, జనవరి 6,**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకుల్లో ఒకరిగా ధర్మాన ప్రసాదరావు కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన రాజకీయ జీవితం దశాబ్దాల పాటు సాగింది. కాంగ్రెస్ పార్టీ లో దీర్ఘకాలం పనిచేసిన ఆయన, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింత బలమైన నాయకుడిగా ఎదిగారు. 1989లో తొలిసారి శాసనసభలో అడుగుపెట్టిన ధర్మాన, అదే సమయంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్లోనే కొనసాగుతూ 2014 వరకు కీలక బాధ్యతలు నిర్వహించారు.రాష్ట్ర విభజన తరువాత రాజకీయ పరిస్థితులు మారాయి. అనుకోని పరిణామాల మధ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్లో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించినా, తర్వాత అదే నేత ఆధ్వర్యంలో పని చేయాల్సి వచ్చింది. పార్టీ మారిన తర్వాత కూడా ఆయన రాజకీయ అనుభవం కారణంగా వైసీపీలో ప్రాధాన్యం దక్కింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా దాదాపు ఏడాది పాటు ఆయన రాజకీయంగా మౌనంగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు.ఇటీవల మాత్రం ధర్మాన మళ్లీ యాక్టివ్గా మారారు. ఈ




మార్పు వెనుక కుమారుడి రాజకీయ భవిష్యత్తే ప్రధాన కారణమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు సరైన రాజకీయ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ధర్మాన మళ్లీ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ధర్మాన ప్రసాదరావుకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి.ఈ పరిణామాల మధ్య ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ( చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. ఆయన ధర్మాన సోదరులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, పార్టీని నాశనం చేస్తున్నారంటూ బహిరంగంగా విమర్శించారు. తన పరాజయాల వెనుక కొన్ని రాజకీయ కుటుంబాల పాత్ర ఉందని కూడా పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ, ధర్మాన కుటుంబాన్ని నమ్మవద్దని కోరిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ వ్యాఖ్యల అనంతరం దువ్వాడ శ్రీనివాస్ పార్టీ నుంచి సస్పెండ్ కావడం గమనార్హం.ఇప్పుడు అదే సమయంలో ధర్మాన ప్రసాదరావుకు మరింత ప్రాధాన్యం పెరగడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా లో ధర్మాన కుటుంబానికి ఉన్న పట్టు దృష్ట్యా, జగన్ వారి సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నారని సమాచారం. తాడేపల్లి కేంద్ర కార్యాలయం బాధ్యతలను ధర్మానకు అప్పగించే ఆలోచన కూడా ఉందని తెలుస్తోంది. ఇప్పటివరకు విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి (, వైవి సుబ్బారెడ్డి వంటి నేతలపై ఆధారపడిన జగన్, ఇకపై పార్టీ బలోపేతం కోసం సీనియర్ నాయకులను ముందుకు తెచ్చే వ్యూహం రచిస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ పరిణామాలన్నీ దువ్వాడ శ్రీనివాస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలు చూస్తే, ధర్మాన ప్రసాదరావుకు ఇచ్చే ప్రాధాన్యం ద్వారా పార్టీలో కొత్త సమీకరణాలు మొదలవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మూడేళ్ల కోసం పక్కా వ్యూహాలు

**విజయవాడ, జనవరి 6,** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రస్తుతం బెంగళూరులో ఉన్నప్పటికీ, ఆయన దృష్టి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల భవిష్యత్తుపైనే ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు పార్టీని మళ్లీ బలోపేతం చేయడం, మరోవైపు అధికార కూటమి వేగాన్ని ఎదుర్కొని వైసీపీని రాజకీయంగా నిలబెట్టడం, అలాగే రాబోయే మూడేళ్లలో జరగనున్న ఎన్నికల కోసం పక్కా వ్యూహాలు రూపొందించడం వంటి అంశాలపై జగన్ సీరియస్గా ఆలోచిస్తున్నారని సమాచారం.కొత్త ఏడాది 2026 ప్రారంభమవడంతో జగన్ ప్రజల్లోకి రావడానికి సిద్ధమవుతున్నారని అంటున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత జిల్లాల పర్యటనలకు ఆయన రంగం సిద్ధం చేస్తారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలను కవర్ చేస్తూ ఈ టూర్లు నిర్వహించాలన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ఈ పర్యటనలు దాదాపు ఆరు నెలల పాటు నిరాటంకంగా కొనసాగుతాయని, ఈ సమయంలో పార్టీ పరిస్థితిని పూర్తిగా అంచనా వేయాలని ఆయన భావిస్తున్నారట.జిల్లాల పర్యటనల అనంతరం పార్టీలో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశముందని అంటున్నారు. గ్రౌండ్ లెవెల్ నుంచి వచ్చే నివేదికలు, నాయకులు మరియు కార్యకర్తల నుంచి నేరుగా అందే ఫీడ్బ్యాక్ ఆధారంగా నియోజకవర్గ స్థాయిలో మార్పులు చేస్తారని అంచనా. కొందరు నాయకులకు బాధ్యతలు మారవచ్చు, మరికొందరికి కొత్త అవకాశాలు కల్పించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఇదే సమయంలో జగన్ 2027లో మరోసారి భారీ పాదయాత్రకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం కూడా బలంగా వినిపిస్తోంది. గతంలో 2017లో ప్రారంభమైన పాదయాత్ర 2019లో పార్టీకి ఘన విజయం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అదే సెంటిమెంట్ను కొనసాగించాలనే ఆలోచనతో 2027ను ఎంచుకున్నారని చెబుతున్నారు. అయితే ఈసారి నవంబర్లో కాకుండా ఫిబ్రవరి లేదా మార్చి నుంచే పాదయాత్ర ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.ఈసారి పాదయాత్ర మరింత భారీగా ఉండబోతోందని అంటున్నారు. సుమారు ఐదు వేల కిలోమీటర్ల లక్ష్యంతో జగన్ నడవాలని భావిస్తున్నారట. అందుకే 2029 ఎన్నికల నాటికి పాదయాత్ర పూర్తయ్యేలా ముందుగానే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర దాదాపు 24 నెలల పాటు కొనసాగే అవకాశమూ ఉందని అంచనా.అయితే గత పాదయాత్ర సమయంలో జగన్ తల్లి విజయమ్మ , చెల్లెలు షర్మిల పార్టీ వ్యవహారాలను చూసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విజయమ్మ రాజకీయాలకు దూరంగా ఉండగా, షర్మిల కొత్త రాజకీయ దారిలో వెళ్లనున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీకి నాయకత్వ స్థాయిలో ఒక లోటు కనిపిస్తోందని అంటున్నారు. అందుకే జగన్ కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టారని సమాచారం. తన సతీమణి భారతిని రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాను పాదయాత్రలో బిజీగా ఉన్నా పార్టీని పర్యవేక్షించేందుకు ఆమె ఉపయోగపడుతుందని జగన్ భావిస్తున్నారట. ఆమెకు రాజకీయ అవగాహన కల్పించడానికి 2026 సరైన సమయమని, ఈ ఏడాదిలోనే ఆమె ఎంట్రీపై ప్రకటన వచ్చే అవకాశముందని అంటున్నారు. అయితే ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

## అడ్డంగా బుక్కైన టీడీపీ నేత

**తిరుపతి, జనవరి 6,** : రాజకీయ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను, మాజీ సైనికులకు కేటాయించిన స్థలాలను చెరబట్టారనే ఆరోపణలు అన్నమయ్య జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మదనపల్లె టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్పై వచ్చిన భూ ఆక్రమణ ఆరోపణలపై లోకాయుక్త సీరియస్ అయ్యింది. పేదలకు, సైనికులకు చెందాల్సిన భూములను నకిలీ పత్రాలతో కాజేసిన వైనంపై కలెక్టర్ నివేదిక ఇవ్వడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.మదనపల్లె నియోజకవర్గం పరిధిలోని బి.కె.పల్లి గ్రామంలో సర్వే నంబర్ 8/1లో ఉన్న సుమారు మూడు ఎకరాల భూమి చుట్టూ ఈ వివాదం ముడిపడి ఉంది. ఇది ప్రభుత్వ రికార్డుల ప్రకారం 'చెరువు పోరంబోకు' భూమి. దీనిని గతంలో దేశం కోసం పోరాడిన మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించింది. అయితే, 2016లో దొమ్మలపాటి రమేష్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఈ భూమిని కబ్జా చేశారనేది ప్రధాన ఆరోపణసుమారు 2.92 ఎకరాల ఈ విలువైన భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, ఆయన భార్య సరళ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని ప్రైవేట్ ఆస్తిగా మార్చుకునే క్రమంలో రెవెన్యూ చట్టాలను, నిబంధనలను తుంగలో తొక్కినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ భూ కుంభకోణంలో కేవలం రాజకీయ నాయకులే కాదు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న రెవెన్యూ అధికారులు కూడా కీలక పాత్ర పోషించడం విస్మయం కలిగిస్తోంది. అప్పటి తహశీల్దార్ శివరామిరెడ్డి, ఆర్ఐ, విఆర్ఓ లు ఎమ్మెల్యేతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేశారు.మరీ ముఖ్యంగా, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజైన ఆదివారం తహశీల్దార్ కార్యాలయం తెరిచి మరీ రికార్డులను మార్చినట్లు విచారణలో బయటపడింది. ఆన్లైన్ రికార్డుల్లో పేర్లు మార్చడం, నకిలీ పట్టాలు సృష్టించడం వంటివి అత్యంత పథకం ప్రకారం జరిగాయి. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే ఒత్తిడికి తలొగ్గి, నిబంధనలకు విరుద్ధంగా అధికారులు సహకరించారని కలెక్టర్ నివేదిక నిర్ధారించింది.ఈ అక్రమాలపై దాఖలైన ఫిర్యాదును విచారించిన లోకాయుక్త న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. మాజీ సైనికులకు ఇవ్వాల్సిన భూమిని కబ్జా చేయడం, చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్ నివేదిక ఆధారంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ అక్రమాలకు సహకరించిన ఐదుగురు ప్రభుత్వ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం కింద బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది.మదనపల్లెలో ఇటీవల సబ్-కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే, ఇప్పుడు మాజీ ఎమ్మెల్యేపై భూ కబ్జా ఆరోపణలు రుజువు కావడం, లోకాయుక్త జోక్యం చేసుకోవడం దొమ్మలపాటి రమేష్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే అవకాశం ఉంది.సాధారణంగా రాజకీయ ఆరోపణలు వేరు, సాంకేతిక ఆధారాలతో కూడిన అధికారుల నివేదికలు వేరు. ఇక్కడ కలెక్టర్ స్వయంగా విచారణ జరిపి, రికార్డుల తారుమారుని నిర్ధారించడం మాజీ ఎమ్మెల్యేకు పెద్ద ఎదురుదెబ్బే. రాబోయే రోజుల్లో ఈ కేసు విచారణ ఎలా సాగుతుంది? క్రిమినల్ కేసుల నమోదు తర్వాత అరెస్టుల వరకూ వెళ్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, కంచే చేను మేసిన చందంగా రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే భక్షకులుగా మారారన్న విమర్శలకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.



# ఎంబీఏకి అవకాశం ఉందా?

**డిగ్రీ (బీఐడీసీ) చేశాను. ఈ కోర్సుతో సాఫ్ట్‌వేర్/ టెక్ ఉద్యోగాలకు అవకాశం ఉంటుందా? ఎంబీఏ (ఐటీ) చదవడానికి వీలవుతుందా?**

ఎంబీఏ(ఐటీ) కోర్సులో ప్రవేశానికి కంప్యూటర్ సైన్స్ లేదా ఇంజినీరింగ్ డిగ్రీ తప్పనిసరి కాదు. ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి కనీసం మూడేళ్ల వ్యవధితో ఏ డిగ్రీ పూర్తి చేసినవారైనా ఎంబీఏ ఐటీలో చేరొచ్చు. ఎంబీఏ కోర్సులో ప్రవేశం ప్రధానంగా క్యాట్, మ్యాట్, సీమ్యాట్ లాంటి ప్రవేశ పరీక్షల్లో సాధించిన ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలతో ఉంటుంది.

నేటి ఉద్యోగ ప్రపంచంలో వివిధ డిగ్రీల మధ్య సరిహద్దులు వేగంగా చెరిగిపోతున్నాయి. సైన్స్ చదివినవారు సైన్స్‌కే, ఆర్ట్స్ గ్రూపు వాళ్లు ఆ విభాగానికే పరిమితం అన్న భావన ఒకప్పుడు ఉండేది. కానీ ఇప్పుడు బీఎస్సీ (లైఫ్ సైన్స్/ మ్యాథ్స్/ కెమిస్ట్రీ/ అగ్రికల్చర్), బీఏ (హిస్టరీ/ ఎకనామిక్స్/ పొలిటికల్ సైన్స్/ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/ సైకాలజీ/ ఇంగ్లిష్/ జర్నలిజం), ఎంబీబీఎస్, బీడీఎస్, బీకామ్ లాంటి నేపథ్యం ఉన్న విద్యార్థులూ ఎంబీఏ (మార్కెటింగ్/ ఫైనాన్స్/ హ్యూమన్ రిసోర్సెస్/ ఆపరేషన్స్/ ఐటీ/ సిస్టమ్స్/ బిజినెస్ అనలిటిక్స్/ హెల్త్ కేర్/ బ్యాంకింగ్/ ఇన్స్యూరెన్స్/ టూరిజం/ ఇంటర్నేషనల్ బిజినెస్/ టెక్నాలజీ మేనేజ్‌మెంట్) చేయడం పూర్తిగా సాధ్యమే.

ఎంబీఏ(ఐటీ)లో కంప్యూటర్ అంశాలతో పాటు బిజినెస్, టెక్నాలజీల అనుసంధానం గురించీ నేర్చుకుంటారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఎక్కువగా నేర్పించకపోయినా, ఐటీ సిస్టమ్స్ ఎలా పనిచేస్తాయి, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు ఎలా నిర్వహించాలి, డేటాను వ్యాపార నిర్ణయాలకు ఎలా ఉపయోగించాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఐటీ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఈ-కామర్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ లాంటి సబ్జెక్టులు ఇందులో ఉంటాయి.

మేనేజ్‌మెంట్ రంగంలో రాణించాలంటే డేటా విశ్లేషణ, లాజికల్ థింకింగ్, సృజనాత్మకత, సమస్యా పరిష్కారం లాంటి నైపుణ్యాలు అవసరం. ముఖ్యంగా హెల్త్‌కేర్, ఫార్మా, బయోటెక్ ప్రాజెక్టుల్లో బీఎస్సీ లైఫ్ సైన్సెస్, ఎంబీఏ (ఐటీ)ల కలయికకు మంచి డిమాండ్ ఉంది.

ఎంబీఏ (ఐటీ) పూర్తి చేసిన వారికి బిజినెస్ అనలిస్ట్, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, సిస్టమ్స్ అనలిస్ట్, ప్రొడక్ట్ మేనేజర్ (టెక్), ఐటీ కన్సల్టెంట్, డిజిటల్ ఆపరేషన్స్ మేనేజర్ లాంటి హోదాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఇవి కేవలం సాఫ్ట్‌వేర్ సంస్థల్లోనే కాకుండా బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్, ఈ-కామర్స్, ఎడ్యుటెక్ రంగాల్లో కూడా అందుబాటులో ఉంటాయి.

ఎంబీఏ(ఐటీ) నేరుగా కోడింగ్ ఉద్యోగాల కోసం కాదని గుర్తుంచుకోవాలి. ఇది టెక్నాలజీని నిర్వహించే, దిశానిర్దేశం చేసే పాత్రలను సిద్ధం చేస్తుంది. కాబట్టి ఎంబీఏతో పాటు అవసరమైతే ఎంఎస్ ఎక్సెల్, ఎస్క్యూఎల్, పవర్ బీఐ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ టూల్స్ నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు మరింతగా మెరుగవుతాయి. ఎంబీఏ కోర్సులో ప్రవేశించే ముందు కనీసం రెండేళ్ల వృత్తి అనుభవం ఉంటే మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

# ఎముకలు బలంగా ఉండాలంటే.. వీటిని తీసుకోవాలి!

వయసు మీద పడుతున్న కొద్దీ ఎముకలు సహజంగా బలహీనపడుతుంటాయి. దీంతో ఫ్రాక్చర్లు, ఆస్టియో పోరోసిస్, ఇతర సమస్యల బారిన పడే రిస్క్ పెరుగుతుంది. కానీ, వయసు పెరుగుతున్నా, వృద్ధాప్యంలోకి అడుగు పెట్టినా ఎముకలు దృఢంగా ఉండాలంటే అందుకు కొన్ని చర్యలు తీసుకోవాలి.

**క్యాల్షియం**
ఎముకలకు తగినంత క్యాల్షియం అందేలా చూసుకోవాలి. ఇందుకోసం క్యాల్షియం తగినంత ఉండే పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పాలు, పెరుగు, చీజ్, క్యాబేజీ, బ్రొకోలీ, నట్స్, సీడ్స్ తీసుకోవాలి. 50 ఏళ్లు దాటిన వారు రోజు మొత్తం మీద 1000 నుంచి 2000 మిల్లీ గ్రాముల క్యాల్షియం అందేలా చూసుకోవాలి. అది సాధ్యం కాకపోతే వైద్యుల సూచనతో క్యాల్షియం సప్లిమెంట్ తీసుకోవచ్చు.

**విటమిన్ డీ**
క్యాల్షియం మన ఎముకలకు సరిగ్గా పట్టాలంటే అందుకు విటమిన్ డీ లోటు ఉండకూడదు. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో సూర్యరశ్మి పడేలా చూసుకుంటే మన శరీరంలో విటమిన్ డీ తయారవుతుంది. చేపలు, గుడ్డు పచ్చసొన, డైరీ ఉత్పత్తుల్లోనూ విటమిన్ డీ ఉంటుంది.

**వ్యాయామాలు**
రోజువారీగా శారీరక వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఎముకలు బలంగా ఉంటాయి. నడక, జాగింగ్, డ్యాన్స్, బరువులు ఎత్తడం వంటి వన్నీ ఎముకల సామర్థ్యాన్ని పెంచుతాయి. రన్నింగ్, బ్రిస్క్ వాక్ కూడా చేసుకోవచ్చు.

**వీటికి దూరం**
పొగతాగే అలవాటు, మద్యపాన సేవనం కూడా ఎముకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. పొగతాగడం ఎముకల సాంద్రతను తగ్గిస్తుంది. మన శరీరం క్యాల్షియంను గ్రహించే సామర్థ్యాన్ని మద్యపానం దెబ్బతీస్తుంది.

**పరీక్షలు**
ఎముకల సాంద్రత ఏ మేరకు ఉందో చెప్పే బోన్ డెన్సిటీ టెస్టింగ్ చేయించుకోవాల్సి రావచ్చు. ఎక్స్ రే, స్కాన్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా నష్టం జరగకముందే నివారణ చర్యలు తీసుకోవచ్చు.



# ఈ అలవాట్లు ఉంటే.. మీకు కచ్చితంగా షుగర్ వస్తుంది



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఈ ఆధునికి యుగంలో మన ఆహారపు అలవాట్లు మనకు చాలా రోగాలను తెచ్చిపెడుతున్నాయి. అందులో ఎక్కువ మందికి డయాబెటిస్? సమస్య. చాలా మంది డయాబెటిస్ సమస్యతో బాధ పడుతున్నారు. అటువంటి వాళ్లు ఆహారం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే మంచిది. ఎంత జాగ్రత్తగా ఉంటే ఆరోగ్యం అంత బాగుంటుంది. నిజంగా మనం తీసుకునే ఆహారాన్ని బట్టి మన ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యం మరియు శ్రేయస్సులో ఆహారపు అలవాట్లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి ఒక్కరి ఆహార అవసరాలు మరియు ప్రాధాన్యతలు భిన్నంగా ఉంటాయి ..మధుమేహం అదుపులో ఉండాలంటే పాటించవలసిన ఆహార నియమాలను ఇప్పుడు చూద్దాం. . .

**అధిక చక్కెర ఎంత హాని తెలుసా**
చక్కెర అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి ప్రయోజనకరమైన ఆహారాల వినియోగం తగ్గిపోతుంది. ఇవన్నీ శరీరానికి అవసరమైన కీలకమైన ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఇతర ముఖ్యమైన పోషకాలకు ముఖ్యమైన మూలాలు. అధిక చక్కెర వినియోగం టైప్ 2 మధుమేహం పెరుగుతుంది.

**ప్రాసెస్ చేయబడిన కార్బోహైడ్రేట్లు**
కార్బొహైడ్రేడ్లు శక్తిని ఇస్తాయి. వీటిని తక్కువ నీటితో జీర్ణం చేసుకోవచ్చు. తెల్ల రొట్టె, తెల్ల బియ్యం పాస్తా శుద్ధి చేసిన ధాన్యాలు సులభంగా జీర్ణమవుతాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతాయి.

**ఫైబర్ లేకపోవడం**
ఫైబర్ లేకపోవడం వల్ల, శరీరంలో అనేక రకాల సమస్యలు పెరుగుతాయి. ఎందుకంటే ఫైబర్ తగినంత మొత్తంలో తీసుకోకపోతే, ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలతో పాటు డయాబెటిక్ కూడా పెరుగుతుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు , చిక్కుడులో ఫైబర్ అధికంగా ఉంటుంది. డైటరీ ఫైబర్ లేని ఆహారం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థిరంగా ఉండదు, దీని వలన ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది . రక్తంలో చక్కెర స్థాయిలు ఫైబర్ ద్వారా బాగా నియంత్రించబడతాయి.

**అనారోగ్య కొవ్వులు**
కొవ్వు ఉన్న పదార్థాలు తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వృద్ధి చెందుతుంది. ప్రాసెస్ చేయబడిన , వేయించిన ఆహార పదార్థాలతో పాటు పాల ఉత్పత్తులలో అధిక కొవ్వు ఉంటుంది. వీటిని తీసుకోవం వల్ల ఊబకాయం పెరిగి.. ఇన్సులిన్ తగ్గుతుంది.

**అతిగా తినడం**
క్రమం తప్పకుండా అధికంగా తినడం వల్ల బరువు పెరుగుట మరియు ఊబకాయం ఏర్పడుతుంది., ఇది టైప్ 2 డయాబెటిస్‌కు ముఖ్యమైన ప్రమాద కారకాలు.

**భోజనం వేళలు పాటించకపోవడం**
భోజన వేళలు కూడా పాటించాలి. ఆహారపు అలవాట్లు మారితే రక్తంలో చక్కెర నియంత్రణను దెబ్బతీస్తుంది.
మీరు ఆకలితో అలమటిస్తున్న సందర్భంలో మానసిక కల్లోలం మరియు చికాకు కలిగించే వైఖరి చాలా సాధారణం. మీ శరీరంలో బ్లడ్ షుగర్ స్థాయి తక్కువగా ఉండటం వల్ల, మీరు త్వరగా చికాకు పడతారు. మీరు దీన్ని అలవాటు చేసుకుంటే లక్షణాలు తీవ్రమవుతాయి. మీరు మరింత ఒత్తిడికి గురవుతారు మరియు నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటారు

**ఫాస్ట్ ఫుడ్స్**
ఫాస్ట్ ఫుడ్స్ తరచుగా తీసుకోవడం వల్ల బరువు పెరగడంతో పాటు , ఇన్సులిన్ తగ్గిపోతుంది. దీని వలన మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది, వీటిలో అనారోగ్యకరమైన కొవ్వులు, చక్కెరలు, సోడియం అధికంగా ఉంటాయి.

**అధిక రక్తపోటుతో అధిక ముప్పు**

**పొగతాగడం, మద్యపానం అలవాట్లతోనూ నష్టమే**

**చురుకైన జీవనశైలితో సానుకూల ఫలితాలు**



# గుండెకు ఇవి పెద్ద శత్రువులు!

కరోనరీ హార్ట్ డిసీజ్ అనేది గుండె పోటుకు ఎక్కువగా కారణమవుతుంది. నిజానికి గుండె జబ్బులకు కారణం అయ్యే వాటి నియంత్రణ మన చేతుల్లోనే ఉంటుంది. చాలా మంది దీనిపై శ్రద్ధ లేక గుండె జబ్బులు పెరిగిపోయేలా చేసుకుంటారు. ఎక్కువ మందిలో గుండె జబ్బులకు కారణమవుతున్న ఐదు రిస్క్ అంశాలను పరిశీలించినట్టయితే..

**అధిక రక్తపోటు**
గుండె జబ్బులకు అధిక రక్తపోటు అతిపెద్ద ముప్పు కాగలదు. హార్ట్ ఎటాక్ బాధితులకు చికిత్స చేసే వైద్యులు చెప్పేది ఇదే. ధమనుల ద్వారా రక్తం ప్రవహించే సమయంలో పడే ఒత్తిడే రక్తపోటు. అధిక రక్తపోటు ఉంటే అది గుండె పైనే కాదు, మూత్రపిండాలు, మెదడు, ఇతర అవయాలపైనా చూపుతుంది. వైద్యులు సూచించిన ఔషధాలు తీసుకుంటూ, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో పెట్టుకోవచ్చు.

**ఆహారం**
అనారోగ్యానికి దారితీసే ఆహారానికి దూరంగా ఉండాలి. అధిక చక్కెరలు, సోడియం కొలెస్ట్రాల్ ను పెంచుతాయి. ధమనుల గోడల్లో కొలెస్ట్రాల్ చేరిపోతుంది. రక్తనాళాల గోడలు కుచించుకుపోతాయి. దీంతో రక్త ప్రవాహం సాఫీగా సాగదు. ఫలితంగా హార్ట్ ఎటాక్ రిస్క్ పెరుగుతుంది.

**మద్యపానం**
రోజులో మూడు కంటే ఎక్కువ డ్రింక్ లు (ఆల్కహాల్/5 శాతం ఆల్కహాల్) తాగడం వల్ల కూడా హాని జరుగుతుంది. రక్తపోటు పెరుగుతుంది. దీనివల్ల గుండెపై ముప్పు పెరిగిపోతుంది. గుండె కండరాలపై ఒత్తిడి పడి గుండె జబ్బులకు కారణమవుతుంది.

**చలనం లేని జీవనం**
జీవనశైలి నిశ్చలంగా ఉండకూడదు. చురుగ్గా ఉండాలి. ఎలాంటి అనారోగ్యం లేకపోయినా సరే, శారీరక వ్యాయామం లోపించడం వల్ల గుండె జబ్బులకు దారితీస్తుంది. అధిక రక్తపోటు, మధుమేహం, చెడు కొలెస్ట్రాల్ సమస్యలు పలకరిస్తాయి.

**పొగతాగడం**
గుండెకు పొగతాడం కూడా ముప్పు తెచ్చి పెడుతుంది. సిగరెట్ లోని రసాయనాలు రక్తం మందమయ్యేలా చేస్తాయి. దీంతో క్లాట్స్ ఏర్పడతాయి. దీనివల్ల రక్త సరఫరా తగ్గుతుంది. దీంతో గుండె జబ్బుల రిస్క్ పెరిగిపోతుంది.



# బన్నీ..మహేష్ కెరీర్ గ్యాప్ ఎలా ఉందంటే?



సూపర్ స్టార్ మహేష్ కెరీర్ లో రిలీజ్ ల పరంగా పెద్దగా గ్యాప్ కనిపించదు. ఏడాదికి రెండు సినిమాలు టార్గెట్ గా పెట్టుకున్నా? ఒక సినిమా మాత్రం కచ్చితంగా రిలీజ్ అయ్యేలా చూసుకున్నారు. 'రాజకుమారుడు' నుంచి 'గుంటూరు కారం' వరకూ మహేష్ లైనప్ చూస్తే? విషయం క్లియర్ గా తెలుస్తోంది. 1999లో 'రాజకు మారుడు' రిలీజ్ అనంతరం 2007 వరకూ ఏడాదికో సినిమా చొప్పున రిలీజ్ చేసారు. అదే సమయంలో 'అతిది' రూపంలో భారీ డిజాస్టర్ పడింది. దీంతో మూడేళ్లు గ్యాప్ తీసుకుని 'ఖలేజా' సినిమా చేసాడు. కానీ ఈ సినిమా కూడా డిజాస్టరే అయింది. మహేష్ కెరీర్ లో బ్యాక్ టూ బ్యాక్ ఫ్లాప్ చిత్రాలు ఆ రెండు. ఆ తర్వాత ఏడాది 'దూకుడు'తో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. మహేష్ కెరీర్ లోనే భారీ వసూళ్ల చిత్రంగా నిలిచింది. ఆ తర్వాత మళ్లీ 2020 వరకూ ఎలాంటి గ్యాప్ లేకుండా సినిమాలు చేసుకుంటూ వచ్చాడు. 'సరిలేరు నీకెవ్వరుతో' మరో బ్లాక్ బస్టర్ పడింది. దీంతో తదుపరి సినిమా అంతకు మించి ఉండాలని రెండేళ్లు గ్యాప్ తీసుకుని 'సర్కారు వారి పాట'తో 2022లో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈసినిమా అంచనాలు అందుకోలేదు. దీంతో మళ్లీ రెండేళ్లు గ్యాప్ తీసుకుని త్రివిక్రమ్ తో 'గుంటూరు కారం' చేసాడు.

ఈ సినిమా మంచి విజయం సాధించింది. ప్రస్తుతం దర్శక శిఖరం రాజమౌళితో గ్లోబల్ స్థాయిలో 'వారణాసి' సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఏకంగా పాన్ వరల్డ్ టార్గెట్ గా రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఈ సినిమా రిలీజ్ కోసం రెండేళ్లు గ్యాప్ తీసుకుంటున్నాడు. 2027లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న సంగతి తెలిసిందే. అలాగే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్ లో కూడా పెద్దగా గ్యాప్స్ లేవు. నటుడిగా ప్రయాణం మొదలైన తర్వాత ఏడాదికో సినిమా చొప్పున రిలీజ్ చేసుకుంటూ వచ్చాడు. 2003 'గంగోత్రి' నుంచి 'నా పేరు సూర్య '(2018) వరకూ ఏడాదికో సినిమా థియేటర్లో కనిపించింది. అటుపై రెండేళ్లు గ్యాప్ తీసుకుని 'అల వైకుంఠపురములో' సినిమా చేసాడు.ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడంతో తదుపరి రిలీజ్ కు నో గ్యాప్ అనేసాడు. ఈసారి 'పుష్ప' ఫ్రాంచైజీతో పాన్ ఇండియానే షేక్ చేసాడు. బాలీవుడ్ ని సైతం ఒణికింకిం చిన స్టార్ గా నిలిచాడు. 2021 లో 'పుష్ప ది రైజ్' రిలీజ్ అవ్వగా..అటుపై మూడేళ్లు గ్యాప్ తీసుకుని 'ది రూల్' ని రిలీజ్ చేసారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ ఇంటర్నేషనల్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమతో గ్లోబల్ మార్కెట్ నే టార్గెట్ చేసాడు. ఈ సినిమా రెండేళ్ల గ్యాప్ అనంతరం 2027లో రిలీజ్ అవుతుంది.



# సేతుపతి ఫార్ములా.. హిట్ ఫ్లాప్ నో వర్రీ!



ఇండస్ట్రీలో హిట్ ఉంటేనే పలకరిస్తారు. మరో సినిమా ఇస్తారు. కానీ విలక్షణ నటుడు విజయ్ సేతుపతి విషయంలో మాత్రం ఇది రివర్స్. హీరోగా సినిమాలు చేస్తూనే మరో పక్క క్యారెక్టర్ ఆర్టిస్ట్గా, విలన్గా నటిస్తూ వస్తున్నాడు. సపోర్టింగ్ రోల్స్ కూడా చేస్తూ ప్రతీ ఏడాది 2 నుంచి 3 సినిమాలలో నటిస్తూ బిజీ బిజీగా గడిపేస్తున్నాడు. ఈ ఏడాది సోలో హీరోగా పాన్ ఇండియా మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ ఏడాది నాలుగు క్రేజీ సినిమాలని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాడు. హిట్లు, ఫ్లాప్లు పక్కన పెడితే క్రేజీ లైనప్ ముఖ్యమని గుర్తు చేస్తున్నాడు. వరుస సినిమాలతో నిరంతరం పని చేసే స్టార్గా మార్కెట్లో విజయ్ సేతుపతికి మంచి బజ్ ఉంది. ఈ ఏడాది అరవింద్స్వామి, అదితీరావు హైదరీతో కలిసి 'గాంధీ టాక్స్'లో నటిస్తున్నాడు. ఈ మూవీ జనవరి 30న రిలీజ్ కాబోతోంది. ఇదొక మూకీ మూవీ. సైలెంట్ బ్లాక్ కామెడీ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా దీన్ని రూపొందిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీపై అంచనాలున్నాయి.దీని తరువాత మిస్కిన్ వివాదాస్పద మూవీ 'పిసాసు 2' రానుంది. ఫైనాన్షియల్ క్రైసిస్, నిర్మాణ సంస్థ చుట్టూ వివాదాలు చుట్టుముట్టడంతో గత కొంత కాలంగా రిలీజ్కు నోచుకోని ఈ మూవీ ఇదే ఏడాది ప్రేక్షకులని పలకరించబోతోంది. విజయ్ సేతుపతి చేస్తున్న మరో యాక్షన్ డ్రామా 'అరసన్'. వెట్రిమారన్ డైరెక్టర్. శింబు హీరోగా నటిస్తున్నాడు. 'వడాచెన్నై' యూనివర్స్లో భాగంగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో సేతుపతి కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఇది కూడా ఈ ఇయరే రిలీజ్ కానుంది. ఇక మరోసారి మిస్కిన్ డైరెక్షన్లో 'ట్రైన్' మూవీ చేస్తున్న విజయ్ సేతుపతి టాలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్తో భారీ పాన్ ఇండియా మూవీ చేసిన విషయం తెలిసిందే. 'స్లమ్డాగ్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్న ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ని త్వరలో రిలీజ్ చేయబోతున్నారు. అన్ని కుదిరితే ఫిబ్రవరిలోనే ఇది ప్రేక్షకుల ముందుకు రావచ్చు. వీటితో పాటు రజనీకాంత్ బ్లాక్బస్టర్ సీక్వెల్ 'జైలర్ 2'లో సేతుపతి గెస్ట్ అప్పియరెన్స్ ఇవ్వబోతున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు పలు క్రేజీ ప్రాజెక్ట్లలో విజయ్ సేతుపతి నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇలా హిట్ ఫ్లాఫ్తో సంబంధం లేకుండా ఏడాదికి 2 నుంచి 3 సినిమాలు చేస్తూ మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.